ప్రజాశక్తి

గురువారం 14 సెప్టెంబర్ 2023 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

రోడ్లకు మోక్షమెప్పుడు?

- వర్షాలతో మరింత దుర్భరంగా గ్రామీణ రహదార్లు
- అభివృద్ధికి నోచని ప్రధాన మార్గాలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో చిన్న పాటివర్షాలకే రహదారులు అధ్వానంగా మారుతున్నాయి. కొన్నేళ్లుగా రహదారులు మరమ్మతులకు నోచుకోకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. చాలా మార్గాల్లో రహదారుల పరిస్థితి దారుణంగా ఉండటంతో గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌టిసి బస్సులు నడపటం చాలా కష్టంగా ఉందని డ్రైవర్లు వాపోతున్నారు. ఇందువల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాలు దెబ్బతింటున్నాయి. డెల్టా ప్రాంతంలో చాలా గ్రామాల్లో ప్రధాన రహదారులు దెబ్బతిన్నాయి.

గుంటూరు-పొన్నూరు రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. పొన్నూరు-చందోలు ప్రధాన రహదారి దెబ్బతిన్నా తాత్కాలిక మరమ్మతులతో కాలక్షేపం చేస్తున్నారు.

గుంటూరు-పేరేచర్ల-వయా పెదపలకలూరు రోడ్డు పరిస్థితి ఇప్పటికీ దారుణంగా ఉంది. ఈ రహదారికి సంబంధించి నగరపాలక సంస్థ పరిధిలో తమ పనులు అయ్యాయని ఆర్‌అండ్‌బి అధికారులు రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. దాదాపు కిలో మీటరు వరకు ఈ రహదారి గుంతల మయంగా మారింది. మూడేళ్లుగా కాలయాపన చేస్తున్నారు.

నల్లపాడు-అంకిరెడ్డిపాలెం రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. మేడికొండూరు మండలం సరిపూడి-మందపాడు, మేడికొండూరు-14వ మైలు, ఫిరంగిపురం-గరుడాచలవారిపాలెం, ఫిరంగిపురం-పొనుగుపాడు, గుంటూరు-చిలకలూరిపేట బైపాస్ రహదారి, గుంటూరు- నందివెలుగు రోడ్డు పనులు ఇప్పటివరకు ప్రారంభం కాలేదు.

రాజధాని ప్రాంతంలో అమరావతి-విజయవాడ మార్గంలో పలుచోట్ల దెబ్బతిన్నా కనీస మరమ్మతులు జరగడం లేదు. కొల్లిపర-తెనాలి-శిరిపురం మార్గంలో భారీ గుంతలు ఏర్పడి రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది.

గుంటూరు ఆటోనగర్ నుంచి నల్లపాడు-చిలకలూరిపేట జాతీయ రహదారికి అనుసంధానం చేసే (మహాత్మాగాంధీ ఇన్నర్ రింగ్ రోడ్డు) నాలుగు లైన్ల రహదారి మూడో దశ పనులు పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. గుంటూరు అడవితక్కెళ్లపాడు నుంచి పలకలూరు వరకూ చేపట్టాల్సిన పనులపై పదేళ్లుగా కాలయాపన చేస్తున్నారు. నాలుగేళ్లలో జిల్లాలో కొన్ని రోడ్లుమాత్రమే మరమ్మతులు చేయగా ఇంకా దాదాపు100కుపైగా రోడ్లు మరమ్మతులకు నోచుకోవడం లేదు. తాత్కాలిక మరమ్మతులు చేసినా వర్షాకాలం వచ్చేసరికి రోడ్లు గుంతలు, గోతులతో వాహనాలు వెళ్లేందుకు తీవ్ర అసౌకర్యం ఏర్పడుతోంది. అత్యవసరమైన పనులకుతప్ప వర్షాలకు దెబ్బతిన్న రహదారుల నిర్మాణం కోసం ఆర్‌అండ్‌బికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయకపోవడం వల్ల రహదారుల పరిస్థితి మెరుగు పడటంలేదు.

సమావేశంలో మాట్లాడుతున్న వి.కృష్ణయ్య

సాగర్ ఆయకట్టును కరువు ప్రాంతంగా ప్రకటించాలి

- రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య
- రైతు సమస్యలపై 15-25 తేదీల్లో ఆందోళనలు

ప్రజాశక్తి -గుంటూరు

సాగర్ ఆయకట్టును కరువు ప్రాంతంగా ప్రకటించాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బ్రాడీపేటలోని రైతు సంఘం కార్యాలయంలో బుధవారం జరిగిన జిల్లా కమిటీ సమావేశానికి సంఘం జిల్లా అధ్యక్షులు జె.శివశంకర్ అధ్యక్షత వహించారు. కృష్ణయ్య మాట్లాడుతూ సాగర్ నీరు విడుదల చేయకపోవడంతో గుంటూరు జిల్లాలోని 50 శాతం సాగు భూమి అయిన ఎనిమిది మండలాల్లో పంటలు వెయ్యలేదన్నారు. ఏ పంటలు పండించాలో అయోమయంలో రైతులున్నారని, ప్రజలు తాగునీటి సమస్యనూ ఎదుర్కోవాల్సిన పరిస్థితి వస్తోందని చెప్పారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో సాగర్ కాల్వ పరిధిలోని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని, అన్ని రకాలుగా సబ్సిడీలు ఇవ్వాలని కోరారు. ఐదేళ్ల నుండి పంటలు సరిగా పండక పోవడం, మద్దతు ధరల్లేకపోవడంతో సన్న, చిన్నకారు రైతులు, కౌల్దార్లు అప్పుల పాలయ్యారని, వీరందరికీ రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్కరణ పేరుతో స్మార్ట్ మీటర్లు బిగింపును విరమించుకోవాలన్నారు. గృహాలకు స్మార్ట్ మీటర్లు పెడితే రెట్టింపు బిల్లుల వస్తున్నాయని చెప్పారు.

2లో

డ్రగ్స్ మాఫియాపై చర్యలు తీసుకోవాలి

- యజమానికి వదిలేసి గుమస్తాపై కేసు దారుణం
- ప్రజా సంఘాలు, పార్టీల నిరసన

2లో

ఎస్ఐ అభ్యర్థులకు కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్షలు

2లో



సత్తెనపల్లి దీక్షలో మాట్లాడుతున్న కన్నా లక్ష్మీనారాయణ

చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టిడిపి రిలే దీక్షలు

3లో

ఓటరు పున:పరిశీలన పూర్తి

3లో

వినుకొండ నియోజకవర్గ సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరు వెంకట నాగేశ్వరరావు

ఆటో నగర్‌కు పదిరోజుల్లో శంకుస్థాపన

- వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలకు సరిపడా భూమిని చూడండి
- బియ్యం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడితే సత్వరమే వేలం
- వినుకొండ, నరసరావుపేట నియోజకవర్గాల సమీక్షలో పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కారుమూరు వెంకట నాగేశ్వరరావు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా, వినుకొండ

నరసరావుపేటకు సమీపంలోని కేసానుపల్లి వద్ద గుర్తించిన 18.9 ఎకరాల్లో ఆటో నగర్ ఏర్పాటుకు సమగ్ర నివేదికను పదిరోజుల్లో రూపొందించాలని, శంకుస్థాపనకు ఏర్పాట్లు చేయాలని అధికారులను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కారుమూరు వెంకట నాగేశ్వరరావు ఆదేశించారు. బియ్యం అక్రమ రవాణాపై

2లో

పారిశుధ్య కార్యదర్శుల సస్పెన్షన్

ప్రజాశక్తి-గుంటూరు

పారిశుధ్య పనుల పర్యవేక్షణ లోపం, కేటాయించిన విధులల్లో నిర్లక్ష్య వైఖరి కారణంగా పలువురిపై చర్యలు తీసుకున్నట్లు గుంటూరు నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన జారీ చేశారు. నగరంలోని 22, 11, 10 (ఇంచార్జి) డివిజన్లలోని వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ కార్యదర్శులను విధుల నుండి సస్పెండ్ చేశామని, శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు, మేస్త్రికి ఛార్జి మెమో, శానిటరీ సూపర్వైజర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని తెలిపారు. ప్రజారోగ్యానికి కీలకమైన పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని కమిషనర్ ఈ సందర్భంగా కమిషనర్ హెచ్చరించారు. కొందరు పారివుధ్య కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లు విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటూ ఉదయం మస్టర్‌కు కూడా హాజరు కావడంలేదని ఫిర్యాదులు వస్తున్నాయని, ఇక నుండి పారిశుధ్య పనులు, హాజరును ఆకస్మిక తనిఖీలు చేస్తామని పేర్కొన్నారు. బూర్లవారి వీధి, వినోభనగర్‌లో పారిశుధ్య పనులు సక్రంగా జరగకపోవటం, ఇంటింటి చెత్త సేకరణ ఈ-ఆటోల పర్యవేక్షణ చేయకపోవటంపై ఆయా సిబ్బందిపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

రెంటచింతల వాసికి రాజ్యభాష అవార్డు

ప్రజాశక్తి-రెంటచింతల

హిందీలో పోలీసు వ్యవస్థకు సంబంధించిన సాహిత్యానికి పుస్తక రూపమివ్వడానికి కృషి చేసిన మధ్యప్రదేశ్ రాష్ట్ర రిటైర్డ్ డిజిపి బండి మరియకుమార్‌కు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా రాజ్యభాష గౌరవ అవార్డును గురువారం ప్రదానం చేయనున్నారు. మరియకుమార్ పల్నాడు జిల్లా రెంటచింతలకు వారే కావడం గమనార్హం. స్థానిక సెంట్ జోసెఫ్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిని 1973లో పూర్తి చేసిన ఆయన అనంతరం గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఐసిఎస్‌కు ఎంపికయ్యారు. 33 ఏళ్లపాటు వివిధ హోదాల్లో పనిచేసి 2016-18లో మధ్యప్రదేశ్ డిజిపిగా ఉద్యోగ విరమణ చేశారు. 'భారతదేశంలో శాంతిభద్రతలు' శీర్షికతో హిందీలో పుస్తకాన్ని రచించినందుకు గాను ఆయన్ను అవార్డుకు ఎంపిక చేశారు. పొంత ఊరు, తల్లిదండ్రులు, పాఠశాల, గురువులను తాను ఎన్నటికీ మర్చిపోనని, వారి వల్లే తానీస్థాయికి వచ్చానని ఈ సందర్భంగా మరియకుమార్ ఫోన్ ద్వారా తెలిపారు.

సిబ్బంది అడిగితే భూ పత్రాల కాపీలివ్వండి

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణ పరిధిలో మొదటి దశ కింద జగనన్న శాశ్వత భూ హక్కు భూరక్ష పథకాన్ని అమలు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఇవి రమణబాబు బుధవారం తెలిపారు. సచివాలయ సిబ్బంది, వాలెంటీర్లు నోటీసులు ఇచ్చినప్పుడు భూమికి చెందిన పత్రాల జిరాక్స్ కాపీలు అందిస్తే సదరు ఆస్తులను సర్వే చేసి ధ్రువపత్రాలు ఇస్తామని చెప్పారు. ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

'డాక్టర్ అబ్దుల్ కలాం హెల్త్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం'

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

డాక్టర్ అబ్దుల్ కలాం హెల్త్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని తిరుమల ఇంజినీరింగ్ కాలేజీ వ్యవస్థాపక ప్రిన్సిపల్ డాక్టర్ వైవి నారాయణ అన్నారు. నరసరావుపేట మండలం లోని జొన్నలగడ్డ పరిధిలోని తిరుమల ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం డాక్టర్ అబ్దుల్ కలాం హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని కళాశాల సెక్రటరీ - కరస్పాండెంట్ రావెల సత్యనారాయణ ప్రారంభించారు. ప్రిన్సిపల్ డాక్టర్ వైవి నారాయణ మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తమ కళాశాల విద్యార్థులతో పాటు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది 150 మందికి పైగా వైద్య సేవలు పొందారన్నారు. కంటి, దంత, బిపి, షుగర్, గుండె, కిడ్నీ, ఎముకల పరీక్షలు చేసి మందులు అందించినట్లు చెప్పారు.

ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి

కొండవీడు ఈఎన్ టి హాస్పిటల్ అధినేత డాక్టర్ కె జగన్ మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

తమ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కొండవీడు ముక్కు,చెవి గొంతు హాస్పిటల్ అధినేత డాక్టర్ కంజుల జగన్మోహన్‌రెడ్డి కోరారు. స్థానిక గుంటూరు రోడ్డులోని హాస్పిటల్లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెల 15న నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 24 మందికి ఆపరేషన్లు అవసరమైనట్లు గుర్తించామని, వారిలో 12 మందికి ఉచితంగా ఆపరేషన్ చేసినట్లు చెప్పారు. వచ్చే నెల 2న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. వచ్చే ఏడాదితో తమ హాస్పిటల్ స్థాపించి 25వ ఏడాదికి రాబోతున్న సందర్భంగా తమ హాస్పిటల్ ఉన్న ప్రాంతమైన 3వ వార్డు ప్రజలకు తమ హాస్పిటల్‌లో లభించే వైద్య సేవలలో ఉచిత ఆపరేషన్‌లు, ఉచిత ఓపీ, పరీక్షలు మందులలో రాయితీ అవకాశం కల్పిస్తున్నామని ప్రకటించారు. హాస్పిటల్ వైద్య బృందం డాక్టర్ శ్రీవర్షిని, డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి, డాక్టర్ కళ్యాణ్, మేనేజర్ మహేష్, ఫార్మసిస్ట్ స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్ మాఫియాపై చర్యలు తీసుకోండి

- యజమానిని వదిలేసి గుమాస్తాపై కేసు దారుణం
- ప్రజా సంఘాలు, పార్టీల నిరసన

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణంలో ఇటీవల ఔషధ తనిఖీ అధికారుల దాడుల్లో పట్టుబడిన శాంపిల్స్ మందులను నిల్వ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాలు, పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని లాల్‌బహదూర్ కూరగాయల మార్కెట్ సెంటర్ వద్ద బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెడికల్ మాఫియాగా ఏర్పడి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతూ వ్యాపారం చేస్తున్నారని, రెండ్రోజుల నుండి కొన్ని మెడికల్ షాపులపై మెడికల్ గోడౌన్‌ల్లో అధికారుల తనిఖీల్లో అనేక అక్రమాలు వెలుగులోకి వచ్చాయని అన్నారు. సేకరించిన నమునాలపై వచ్చిన నివేదికలు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రవల్లిక మెడికల్ ఏజెన్సీస్ మరికొన్ని ఔషధ నిల్వల్లో నకిలీ శాంపిల్స్ లభించాయని అనుమానం వ్యక్తం చేశారు. అసలు యజమానులను వదిలేసి గుమస్తాపై కేసు నమోదు చేయాలని యజమాని సూచన చేయటం దారుణమన్నారు. యజమానులపై తక్షణమే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పట్టణంలో అక్రమ మందులు తయారి కేంద్రాలు ఉన్నాయని, ఇందులో మెడికల్ షాపులు యజమానులు పాత్ర ఉన్నట్లు స్పష్టమవుతోందని చెప్పారు. నూనె, పాలు సహా కల్తీ జరుగుతున్నట్లు

నిరసన కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు

అనేక సందర్భాల్లో వెలుగు చూసిందని, వీటిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. కార్యక్రమంలో వివిధ పార్టీలు, సంఘాల నాయకులు షేక్ మస్తాన్‌వలి, సిలార్ మసూద్, వై.వెంకటేశ్వరరావు, రెడ్ బాషా, షేక్ దరియావలి, వి.కోటానాయక్, మస్తాన్‌వలి, సాంబిరెడ్డి, సుభాని పాల్గొన్నారు.

వెంటిలేటర్‌పై వచ్చినా పట్టించుకోరా?

సీనియర్ల తీరుపై జిజిహెచ్‌సూపరింటెండెంట్ అసంతృప్తి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రికి వెంటిలేటర్ పై వచ్చే రోగులకు సత్వర వైద్య సేవలు అందించకుండా గదుల్లో కూర్చొని పాఠాలు చెప్పడం ఎంతవరకు సమంజసమని జిజిహెచ్ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ సీనియర్ వైద్యులను ప్రశ్నించారు. బుధవారం ఆకస్మికంగా అత్యవసర విభాగాన్ని ఆయన తనిఖీ చేశారు.అత్యవసర విభాగానికి వెంటిలేటర్ పై రోగులు వస్తే చూసే వారు కరువయ్యారని ఆయన అన్నారు. రోగుల సహాయకులు వచ్చి ఫిర్యాదు చేయడంతో క్యాజువాల్టిని పరిశీలిస్తే సీనియర్ రెసిడెంట్ వైద్యులు కనిపించలేదని ఆయన చెప్పారు. ఆ సమయంలో సియంఒ లు లేకపోవడం తో వారి పరిస్థితి ఏవిధంగా ఉంటుందో అర్థం చేసుకోగలమని ఆయన అన్నారు. ప్రతి రోజు సీరియస్ గా చెబుతున్న పెడచెవినా పెడుతున్నారని ఆయన చెప్పారు. ఈ విభాగానికి వచ్చే ప్రతి రోగిని కాపాడాలసిన బాధ్యత ఎస్ ఆర్ ల పై ఉందని ఆయన సూచించారు. వెంటిలేటర్ పై వచ్చే రోగులను రూమ్ లో వదిలేసి వెళ్లుతున్నారని ఆయన అన్నారు. రోగుల ఆరోగ్యం గురించి పట్టించుకునే వారు లేరని ఆయన అన్నారు. రోగుల రద్దీ పెరుగుతున్న దృష్ట్యా ఇద్దరినీ సిఎంఒలు గా నియమించామని ఆయన గుర్తుచేశారు. అత్యవసర విభాగానికి వచ్చే రోగులను కాపాడాల్సిన బాధ్యత ఉందని అన్నారు. అందరూ రూమ్ లోకి వెళ్లి తరగతులు వింటున్నమంటే ప్రాణాపాయ స్థితి లో ఉన్న రోగుల గురించి ఎవ్వరు పట్టించుకుంటారని ఆయన అన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే చెప్పమని పదే పదే చెబుతున్నా చెప్పేందుకు ముందుకు రాలేక పోతున్నారని ఆయన విచారం వ్యక్తం చేశారు. ఆసుపత్రి పై నమ్మకంతో వచ్చే రోగులను కాపాడమని కోరుతున్నట్లు ఆయన చెప్పారు. ప్రభుత్వం వైద్య రంగానికి కోట్లు ఖర్చు పెడుతోందని ఒక్కొక్కరికి లక్షల్లో జీతాలు చెల్లిస్తోందని ఆయన చెప్పారు. వెంటిలేటర్ పై వచ్చే రోగులను బ్రతికించేందుకు కషి చేద్దామని ఆయన సూచించారు. ఆసుపత్రి క్యాజువాల్టి విభాగం లో నూతనంగా అత్యవసర మెడిసిన్ విభాగాన్ని ఏర్పాటు చేశామని వారి సేవలు ఐ సి యు, క్యాజువాల్టి, పిడియాట్రిక్, లేబర్ వార్డుల్లో ప్రమాదకర స్థితి లో ఊపిరి తీసుకోవడం కష్టంగా ఉన్న సమయం లో కాపాడాలసిన బాధ్యత సీనియర్ రెసిడెంట్ వైద్యులపై ఉందని ఆయన చెప్పారు. ఆసుపత్రి మొత్తం పర్యవేక్షణ చేయాల్సిన బాధ్యత మెడిసిన్ విభాగానికి ఉందన్నారు. కోవిడ్ 19 సమయం లో వారు చేసిన సేవలు ప్రపంచం మొత్తం కొనియాడింది. ఏమర్జన్సీ విభాగానికి వచ్చే ప్రతి ఒక్కరు కోవిడ్ సమయం లో ఏవిధంగా సేవలు అందించారో అదే స్థాయిలో ఉండాలని కోరుకొంటున్నారని ఆయన గుర్తు చేశారు. ఈ విభాగం లో అసోసియేట్ ప్రొఫెసర్, పి జి, 9 మంది ఎస్ ఆర్ లు, పది మంది యం బి బి ఎస్ వైద్యులు పని చేస్తున్నారు. వారందరు సక్రమైన పద్ధతి లో వైద్యం అందించాలని ఆయన చెప్పారు. వీరంతా సూపరింటెండెంట్ పర్యవేక్షణ లో పని చేయాలన్నారు. అంతిమంగా రోగుల ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత పర్యవేక్షణ చూడాల్సిన బాధ్యత సూపరింటెండెంట్ పై ఉందని ఆయన వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి నేతత్వం లో ఇంటింటికి సర్వే చేసి రోగులను గుర్తించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. పేద ప్రజల కోసం జగనన్న సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టారని ఆయన చెప్పారు.

ఆసుపత్రి కి వచ్చే రోగులకు సరైన వైద్యం చేయకపోతే ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు వ్యతిరేకం గా ఉంటోం దన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, స్పెషల్ చీఫ్ సెక్రటరీ యం టి కష్ణబాబు చేస్తున్న సూచనల మేరకు అత్యవసర వైద్యం ప్రతి ఒక్కరికి అందేలా శ్రద్ధ తీసుకోవాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రి కలలను సాకారం చేసే విధంగా పని చేయాలనీ ఆయన కోరారు.

సాగర్ ఆయకట్టును కరువు ప్రాంతంగా ప్రకటించాలి

(మొదటి పేజీ తరువాయి)

ఎరువులు, పురుగు మందుల ధరలు పదిరెట్లు పెరిగాయని, ఆర్‌బికేల్లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఏవీ అందించడం లేదని విమర్శించారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు మాట్లాడుతూ కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు కోసం భూ యజమాని సంతకం, అనుమతి ఉండాలనే నిబంధన వల్ల 90 శాతం మంది కౌల్దార్లకు కార్డులు దక్కడం లేదన్నారు. ఈ కారణంగా కౌలురైతులకు రుణాలు, ప్రభుత్వ సబ్సిడీలు అందడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. రెవెన్యూ సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. లంక భూములు దీర్ఘకాలంగా సాగు చేస్తున్న పేద రైతులను భూముల నుండి వెళ్లగొట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో రైతు సమస్యలపై ఈనెల 15-25 తేదీల్లో ఆర్‌బికేల్లో వినతి పత్రాలు, మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించాలని సమావేశం తీర్మానించింది. పాడి రైతులకు ఇవ్వాల్సిన లీటరుకు రూ.4 బోనస్‌ను ప్రభుత్వం వెంటనే చెల్లించేలా ఆందోళనలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి కె.అజయ్ కుమార్, ఉఎ ధ్యక్షులు ఎం.శివసాంబిరెడ్డి, నాయకులు కె.పూర్ణ చంద్రరావు, కె.వెంకటేశ్వరరావు, వై.బ్రహ్మేశ్వరరావు, ఎం.వెంకటేశ్వరరావు, సిహెచ్.భాస్కర్‌రావు, కె.ప్రవంతి, సాంబశివరావు, నాగేశ్వరరావు, సుధాకర్‌రావు, ఐ.రామారావు పాల్గొన్నారు.

ఆటో నగర్‌కు పదిరోజుల్లో శంకుస్థాపన

(మొదటి పేజీ తరువాయి)

ఉక్కుపాదం మొపుతామని చెప్పారు. నరసరావుపేట, వినుకొండ నియోజకవర్గాల సమీక్ష సమావేశాలు వినుకొండ, నరసరావుపేటలో బుధవారం నిర్వహించగా మంత్రి పాల్గొన్నారు. నరసరావుపేట సమీక్షలో మాట్లాడుతూ వెటర్నరీ పాలిటెక్నిక్ కాలేజీ కోసం రొంపిచర్ల మండలం సంతగుడిపాడులో గుర్తించిన ఎన్ఎస్పి కెనాల్ భూమి సరిపోదని, ఏడెకరాలను గుర్తించాలని చెప్పారు. కత్వా చెరువు నిర్మాణానికి రూ.19 కోట్లు మంజూరు చేసిందని, పనులను ప్రారంభించాలని అన్నారు. మైనారిటీ సక్షేమ హాస్టల్‌లో సిబ్బందిని భర్తీ చేయాలని, మైనారిటీ కాంప్లెక్స్ భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. అంజుమన్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి అవసరమైన రూ.70 లక్షలు మంజూరుకు అనుమతిచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. 525 టిడ్కో ఇళ్లకు విద్యుత్ సరఫరా, మోటార్లు సోమవారం నాటికి పూర్తి చేయాలన్నారు. ఉప్పలపాడు లే అవుట్‌లో 4300 గృహాలు మంజూరైన నేపథ్యంలో ఆప్షన్-3 కింద లబ్ధిదార్లు ఇళ్లు నిర్మించుకునేలా ప్రోత్సహించాలని, 90 రోజుల్లో ఇళ్ల పట్టాలపై పెండింగ్ కేసులు, ఇతర డేలా మొత్తం అందించాలని చెప్పారు. విప్పర్లపల్లి మైనింగ్ లేవలింగ్ పనులు పూర్తి చేయాలని, విప్పర్లపల్లి, లింగంగుంట్ల ప్రాంతంలో భూముల రీ-సర్వేను ఏడ్రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. సచివాలయాలు, రైతు భరోసా భవనాల నిర్మాణం వేగం పెంచాలన్నారు. వినుకొండ నియోజకవర్గ సమీక్ష అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ తూనికలు కొలతల శాఖ ద్వారా విస్తృత తనిఖీలు నిర్వహించి పట్టుబడిన బియ్యాన్ని వెంటనే వేలం వేస్తామన్నారు. ఫోర్టిఫైడ్ బియ్యంలో 100 గింజలకు ఒక గింజ ఫోర్టిఫైడ్ గింజ కలుపు తారని చెప్పారు. ఇదిలా ఉండగా జిల్లాలో పెదకూరపాడు, సత్తెన పల్లి, వినుకొండ, నరసరావుపేట నియోజకవర్గాల సమీక్షలు పూర్తయ్యాయని, మిగతా వాటినీ త్వరలో సమీక్షిస్తామని చెప్పారు. సమీక్షల్లో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు డాక్టర్ జి.శ్రీనివాసరెడ్డి, బి.బ్రహ్మనాయుడు, కలెక్టర్ ఎల్.శివ శంకర్, జెసి శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్ఐ అభ్యర్థులకు కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్షలు

ప్రజాశక్తి - గుంటూరు సిటీ

పోలీసు నియామక పక్రియలో భాగంగా గుంటూరు రేంజ్ పరిధికి సంబంధించి ఎస్ఐ అభ్యర్థులకు గుంటూరు పెరేడ్ గ్రౌండ్స్‌లో దేహదారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. గుంటూరు రేంజ్ ఐజి పాల్‌రాజు, నెల్లూరు జిల్లా ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో బుధవారం 664 మంది అభ్యర్థులకు పరీక్షలు నిర్వహించగా 342 మంది అర్హత సాధించారు. ధ్రువపత్రాల పరిశీలన తర్వాత బయోమెట్రిక్, ఎత్తు, ఛాతి వంటి ఫిజికల్ మెజర్మెంట్ పరీక్షలు, 1600, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పరీక్షలు నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) సుప్రజ, డీఎస్పీలు చంద్రశేఖర్‌రావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కెసిపి ఆధ్వర్యంలో నేడు ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - మాచర్ల : స్థానిక కెసిపి లిమిటెడ్ ఆధ్వర్యంలో గురు వారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామని అధికారులు బుధవారం తెలి పారు. సంస్థ చైర్మన్ వెలగపూడి ఇందిరాదత్ పుట్టినరోజు సందర్భంగా కెసిపి స్టార్స్ ప్రక్కన గల ఆడిటోరియంలో నర్సరావుపేటకు చెందిన శేషాద్రి కేన్సర్ సెంటర్ ద్వారా శిబిరం నిర్వహిస్తామన్నారు.

గుంటూరులో

వినుకొండలో

చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టిడిపి రిలే దీక్షలు

ప్రజాశక్తి-గుంటూరు : టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అరెస్ట్‌కు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా ఆ పార్టీ శ్రేణులు చేపట్టిన 'మేము సైతం' రిలేదీక్షలు, నిరసనల్లో భాగంగా బుధవారం గుంటూరు కలెక్టరేట్ ఎదుట టిడిపి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోవెల మూడి రవీంద్ర ఆధ్వర్యంలో నిరసన రిలే దీక్ష నిర్వహిం చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మానుకొండ శివప్రసాద్, సుఖవాసి శ్రీనివాస్, డాక్టర్ నిమ్మల శేషయ్య, రావిపాటి సాయి, కార్పొరేటర్లు పాల్గొన్నారు. **గుంటూరు జిల్లా ప్రతినిధి:**టిడిపి అధ్యక్షులు చంద్రబాబు అక్రమ అరెస్ట్ ను ఖండిస్తూ గుంటూరు తూర్పు నియోజకవర్గం ఇంచార్జి మొహమ్మద్ నసీర్ ఆధ్వర్యంలో నియోజకవర్గం లో స్థానిక డొంకరోడ్డులో రిలేదీక్షలు నిర్వహించారు. రిలే నిరాహార దీక్ష లో టిడిపి అధ్యక్షులు తెనాలి శ్రావణ్ కుమార్, సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ , సిపిఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి ,టిడిపి నాయకులు చిట్టిబాబు , డేగల ప్రభాకర్ , దాసరి రాజా మాస్టర్, వేములకొండ శ్రీనివాస్ , గొళ్ల ప్రభాకర్ , కార్పొరేటర్లు ఎల్లావుల అశోక్, పోతురాజు సమత, ముప్పవరపు భారతి తదితరులు పాల్గొన్నారు.

తెనాలి :వైసిపి ప్రభుత్వం పథకం ప్రకారమే చంద్రబాబునాయుడుపై తప్పుడు కేసు బనాయించిందని, ఇది ప్రిజనర్ జగన్, విజనర్ చంద్రబాబుకు మధ్య జరుగుతున్న యుద్ధమని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు అన్నారు స్థానిక మహాత్మాగాంధీ మున్సిపల్ మార్కెట్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద ధర్నా చేపట్టేందుకు పెద్ద ఎత్తున చేరుకున్న టిడిపి నాయకులను పోలీసులు ధర్నాకు అనుమతి లేదని పంపివేశారు. దీంతో కొందరు అన్నాబత్తుని పురవేదికపై, మరికొందరు గాంధీచౌక్‌లో నిరసన దీక్షలు చేశారు. పురవేదికపై కూడా మున్సిపల్ అనుమతి తీసుకోవాల్సి ందేనంటూ అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఎల్ఎస్ సుబ్బారావు, సిబ్బంది ఆందోళనకారును వారించటంతో కొద్దిసేపు టిడిపి నాయకులు, అధికారులకు మధ్య వాగ్వివాదం జరిగింది.కార్యక్రమంలో నాయకులు టి.హరిప్రసాద్, తెలుగు మహిళ కార్యనిర్వాహక కార్యదర్శి జాస్తి సరళ, జెట్టి రేణుక, సయ్యద్ గౌసియా భేగం, పాల్గొన్నారు. **మంగళగిరి :** రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అక్రమంగా కేసు బనాయించి జైలుకు పంపారని ఎమ్మెల్సీ పి అనురాధ, గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గం టిడిపి ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు అన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టు నిరసిస్తూ బుధవారం టిడిపి ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్లో నిరాహార దీక్షలు ప్రారంభించారు. శిబిరాన్ని ఆమె సందర్శించి దీక్షలకు సంఘీభావం తెలిపారు. 35 మంది టిడిపి కార్యకర్తలు నల్ల రిబ్బన్లతో దీక్షలో పాల్గొన్నారు. దీక్షలకు పలువురు సంఘీభావం తెలిపారు.

తాడికొండ : తాడికొండ అడ్డరోడ్డు వద్ద టిడిపి నాయకులు తలశిల ప్రసన్న ఆధ్వర్యంలో నిరసన దీక్షలో నాయకులు గుంటుపల్లి మధుసూదనరావు, కనగాల కళ్యాణ్ చంద్, బండ్లమూడి లింగయ్య పాల్గొన్నారు. **పొన్నూరు రూరల్ :** పొన్నూరు ఐలాండ్ సెంటర్లో టిడిపి రిలే దీక్షకు సిపిఐ నాయకులు పుప్పాల సత్యనారాయణ సంఘీభావం తెలిపారు. **ప్రత్తిపాడు:**ప్రత్తిపాడులో నిర్వహిం చిన దీక్షల్లో మాజీ మంత్రి మాకినేని పెదరత్తయ్య, నియోజ కవర్గ ఇన్‌ఛార్జి బి రామాంజనేయులు, ప్రసంగించారు.

పల్నాడు జిల్లా: నరసరావుపేటలో గుంటూరు రోడ్డులో గల టిడిపి కార్యాలయంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షల్లో టిడిపి నాయకులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మాజీ ఎమ్మేల్యే జీవీ ఆంజనేయులు ప్రసంగించారు. **వినుకొండ :** పల్నాడు జిల్లా వినుకొండలో చంద్రబాబు నాయుడుపై అక్రమ అరెస్టును నిరసిస్తూ వినుకొండ పట్టణంలోని శివయ్య స్తూపం వద్ద టిడిపి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. దీక్ష శిబిరాన్ని సందర్శించిన జీవీ ఆంజ నేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ రెడ్డి చేస్తున్న అవినీతి,అక్రమాలు, దోపిడీలను ఎత్తి చూపినందుకు చంద్రబాబు నాయుడు పై తప్పుడు కేసులు బనాయించి అక్రమ అరెస్టులు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు మహంకాళి సుబ్బారావు, బోదాల శ్రీనివాసరావు, టిడిపి నాయకులు. సీనియర్ న్యాయవాదులు రామకోటేశ్వరరావు, సిద్ధయ్యపొట్లూరు సైదారావు, టిడిపి నాయకులు షమీ ఖాన్, పటన్ ఆయబ్ ఖాన్, పివి సురేష్ బాబు, పత్తి పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. **సత్తెనపల్లి టౌన్ :** సత్తెనపల్లిలో గుంటూరు బస్టాండ్ వద్ద రిలే దీక్షా శిబిరంలో మాజీ మంత్రి, టిడిపి నియోజకవర్గ అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతు రాష్ట్రంలో సైకో పాలన సాగుతుందని అందులో భాగమే తమ పార్టీ జాతీయ అధ్యక్షులు నార చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు అని ఘాటు విమర్శలు చేశారు . వైసీపీ ఆరాచక పాలనకు ప్రజలు బుద్ధిచెప్పే రోజు రానున్నది అని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో పూజల వెంకట కోటయ్య , ఎం రామ చంద్రరావు , ఆళ్ళ సాంబయ్య , ఆతుకూరి నాగేశ్వరావు , గన్నమనేని శ్రీనివాసరావుపాల్గొన్నారు. దీక్షలకు సిపిఐ నాయకులు మద్దతు తెలిపారు. **కారంపూడి :** కారంపూడి పట్టణంలోని, చింతపల్లి రోడ్డుకు దగ్గరలో జూలకంటి బ్రహ్మారెడ్డి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. దీక్షలకు సిపిఐ మాచర్ల నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీనివాసరెడ్డి, కారంపూడి మండల అధ్యక్షుడు షేక్. సైదా సంఘీభావం తెలిపారు. **పెదకూరపాడు :** పెదకూరపాడులో టిడిపి రిలే దీక్షల్లో గుంటూరు మాజీ యార్డు చైర్మన్ ఎన్నా సాంబశివరెడ్డి, నాయకులు నూర్జహాన్, రమేష్ ప్రసంగించారు. **రొంపిచర్ల :**మండలంలో వి.రెడ్డిపాలెం గ్రామంలో టిడిపి నాయకులు వి.రెడ్డిపాలెం గ్రామం నుండి విప్పర్ల గ్రామం మీదుగా మర్రిచెటుట్టుపాలెం గ్రామం వరకు పాదయాత్ర చేశారు.


తెనాలి నిరసనలో నక్కా ఆనందబాబు

అత్యంత అవినీతిపరుడు చంద్రబాబు

మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - మంగళగిరి

అత్యంత అవినీతిపరుడు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి బుధవారం మంగళగిరిలో మీడియాతో మాట్లాడుతూ అన్నారు. స్కిల్ డెవలప్మెంట్‌లో అవినీతి జరిగింది కాబట్టి జైలుకు వెళ్లారని అన్నారు. వ్యవస్థలను అన్నివేళలా మేనేజ్ చేయలేరని అన్నారు. ప్రజాస్వామ్యంలో చట్టానికి వ్యతిరేకంగా ఎవరు వ్యవహరించిన జైలుకు వెళ్లాల్సిందేనని అన్నారు. కాగా మంగళగిరి టిడ్కో గృహ సముదాయంలో రూ.7కోట్లతో జరుగుతున్న విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరలో నిర్మాణాలను పూర్తి చేసి విద్యుత్‌కి అంతరాయం లేకుండా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు చోరీ

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని గోపువారిపాలెం,చిట్టా పురం గ్రామాలలో రెండు ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గోపువారిపాలెం గ్రామానికి చెందిన గోనుగుంట్ల వెంకటేశ్వర్లు,చిట్టా పురం గ్రామానికి చెందిన కంచర్ల శీను ఇంటి ముందు ఉంచిన వాహనాలను గుర్తు తెలియని దుండగులు సోమవారం రాత్రి చోరీ చేశారు.అయితే గోపు వారిపాలెం గ్రామంలో చోరీకి గురైన ద్విచక్ర వాహన ప్రాంతంలో దుండగుడు మరో ద్విచక్ర వాహనాన్ని వదిలి వెళ్లాడని గ్రామస్తులు తెలిపారు. చోరీ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

ఘర్షణలో నలుగురికి గాయాలు

ప్రజాశక్తి-దుగ్గిరాల

మండలంలోని మంచికలపూడి గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన ఘర్షణలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి గాయాలయ్యాయి. ఆరాధ్యుల పద్మావతి అనే మహిళకు ఆమె తల్లి శివశంకరమ్మ కుమారుడు శ్రీనివాస్ కోడలు లక్ష్మి శ్రీ జ లకు గాయాలయ్యాయి. పద్మావతి శివ శంకరమ్మ తెనాలి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందు తున్నారు, ఆమె కొడుకు కోడలుకు ప్రథమ చికిత్స చేసి పంపివేశారు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రోడ్డుపై ఆటో పెట్టుకునే క్రమంలో జరిగిన గొడవలో అదే గ్రామానికి చెందిన చిన్ని ప్రసాద్ అతని కుటుంబ సభ్యులు పుష్ప ప్రియ పార్వతి అనూష లు పద్మావతి ఇంటిపై దాడి చేసి ఇనుప రాడ్డుతో ఆమెను ఆమె తల్లిని గాయపరిచినట్లు తెలిపారు .పద్మావతి తలకు కుట్లు పడ్డాయని తెలిసింది దుగ్గిరాల పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

మిర్చి నిల్వలు

బ్యాగులు

మిర్చి దిగుమతి	: 29,358
మిర్చి ఎగుమతి	: 27,467
మిర్చి నిల్వ	: 12,555

మిర్చి ధరలు

	రూపాయలలో
334	10,000 - 23,500
నెం.5	16,000 - 19,200
273	17,500 - 17,500
341	10,000 - 21,800
4884	12,500 - 18,800
సూపర్ 10	20,500 - 20,600
	నాన్ ఎసి
తేజ	9,500 - 23,500
బడిగి	10,000 - 25,500
దేవనూరు డీలక్స్	13,000 - 20,000
తాలుకాయలు	5,000 -14,500
	ఎసి
334	13,000 - 21,500
నెం.5	15,000 - 15,000
341	15,000 - 21,500
273	17,300 - 17,300
4884	9,900 - 19,000
తేజ	12,000 - 23,000
బడిగి	15,000 - 25,000
తాలుకాయలు	6,500 -13,000

GENERAL NOTICE
IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE::NARASARAOPET
I.P. No. 52 / 2023

BETWEEN:
Peruboina Punnamma,W/o.Late Krishna Murthy, R/o. Ikkurru(V),Narasarao pet(Md),PalnaduDt. ..Petitioner
AND
1)Smt.Dasam Vara Lakshmi,W/o. Nageswara Rao,2)Basu Subbayamma, W/o.China Anjaneyulu, 3)Peraboina Koteswaramma,W/o.Chiranjeevi,Door No.2-29, 4)Smt.Veerla Adi Lakshmi, W/o.Chandra Sekhar,Door No.2-114.All are R/o.Ikurru(V), Narasaraopet(Md),Palnadu Dt.,5)Smt.Degala Naga Lakshmi,W/o.Syam Kumar,R/o.Door No.1-29, Vannaya Palem(V),Bellamkonda(Md),Palnadu Dt., 6) Smt.Baddeti Anjamma, W/o.Mastanvli,R/o.Ikkurru (V),Narasaraopet(Md), Palnadu Dt. 7)Smt. Pothuraju Venka Yamma, W/o.Veera Lankaiah, R/o.Ikkurru (V), Narasaraopet(Md),Palnadu Dt. 8)Sri. Marri Naga Raju,S/o.Seshagiri, R/o.Aminabad(V), Phirangi Puram(Md), Guntur Dt.,9)The Official Receiver, Dist. Court Complex, Guntur. ...Respondents

పై నెంబరు ఐ.పి లోని పిటీషనర్, ఆర్-1ను ఇన్ సాల్వెంట్‌గా డిక్లేర్‌చేసి, ఆర్-1 అయిన దాసం వరలక్ష్మి,ఆర్-2 నుండి ఆర్-8 పేర్లతో ది.29-05-2023, 30-05-2023, 01-07-2023న వ్రాసిన విక్రయ ద.నెంబర్లు.12960/2023, 12961/2023,12962/2023, 12977/2023, 12978/2023 & 15983/2023 యస్.ఆర్.ఓ నరసరావుపేటలను రద్దుపరచి, పిటీషన్ దాఖలా ఆస్తిని ఆర్-9 వారి కోర్టులో వేలం వేయించి తన బాకీ తీర్చమని కోరుచూ పిటీషన్ దాఖలు చేయగా సదరు పిటీషన్‌పై ఎవరికైన ఏవిధమైన అభ్యంతరములు వగైరాలు ఉన్నచో తెలుపుకోనవలసినదిగా శ్రీ కోర్టు వారు జనరల్ నోటీసు నిమిత్తం **ది:09-10-2023**కి వాయిదా వేసినారు. కావున ఆ రోజున ఉగం॥ **10-30**ని॥లకు ఆక్షేపణలు ఉన్న వారు పై కోర్టు వారి ఎదుట హజరై తెలుపుకోనగలరు.లేనిచో శ్రీ కోర్టు వారిచే చట్ట ప్రకారం మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.
వాయిదా తేది:**09-10-2023.**

సి. నరేంద్ర బాబు, పిటీషనరు తరపు అడ్వకేట్,
4వ లైను, బృందావన్ గార్డెన్స్, గుంటూరు. సెల్: 9246485115

ధైనందిన జీవితంలో చిరుధాన్యాలు

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మాదలలోని అంగన్వాడీ కేంద్రంలో ఇరుకుపాలెం సెక్టార్ ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జి.జయలక్ష్మి ఆధ్వర్యంలో పోషణ్ మహ బుధ వారం నిర్వహించారు.ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ ధైనందిన జీవితంలో చిరుధాన్యాల ప్రాముఖ్యత కీలకమైందన్నారు. ఆకుకూరలు, పండ్లు,పాలు, గుడ్లు, కాయ గూరలు రోజువారీ ఆహారంలో తీసుకోవడం ద్వారా పోషకాలు అందుతాయన్నారు.

డాక్యుమెంట్లు పోయినది

నా పేరు మేడా వెంకట్రావు, తండ్రి : వెంకటేశ్వర్లు, జులై 12, 2023న గుంటూరు నుండి క్రోసూరు వస్తుండగా నా స్థలం డాక్యుమెంట్లు పోగొట్టుకున్నాను. డాక్యుమెంట్ నెం. 756/2014. ఈ డాక్యుమెంట్లు ఎవరికైనా దొరికిన యెడల దయచేసి ఈ క్రింది నెంబర్లకు తెలియజేయగలరు.

ఎం.వెంకట్రావు,
సెల్ నెం : **95508 11635**

జిజిహెచ్‌లో గుర్తుతెలియని మృతదేహం

ప్రజాశక్తి -గుంటూరు సిటీ

గుంటూరు రైల్వే స్టేషన్ 2 నెంబర్ గేటు వద్ద గల చెట్టు అరుగుపై చనిపోయిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. కొత్తపేట సి.ఐ షేక్ అన్వర్ భాష తెలిపిన వివరాల ప్రకారం బుధవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో స్పృహ లేకుండా పడి ఉన్న సుమారు 35 నుండి 40 సంవత్సరాల వయస్సు గల యువకుడ్ని పోలీసు సిబ్బంది గుర్తించారని, అనంతరం జి.జి.హెచ్ తరలించి పరీక్షలు నిర్వహించగా అప్పటికే ఆ వ్యక్తి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారన్నారు. అతని ఆచూకీ కోసం చుట్టుపక్కల విచారించగా ఎటువంటి వివరాలు తెలియలేదని మృతదేహాన్ని జి.జి.హెచ్ శవాగారంలో ఉంచినట్లు సి.ఐ తెలిపారు. మృతుని ఎత్తు సుమారుగా 5-6 అడుగులు ఉండొచ్చని, నలుపు రంగు ఛాయతో, ఎడమ చేతి పై భవాని అని, కుడి చేతి పై తుపాకీ గుర్తులు పచ్చబొట్టు ఉందన్నారు. వివరాలు తెలిసినవారు. 8688831320, 8688831609 నెంబర్లకు ఫోన్ చేసి కొత్తపేట పోలీసులను సంప్రదించాలని కోరారు.

ఓటర్ల జాబితా చేర్పులు, మార్పులపై తనిఖీ

ప్రజాశక్తి - మాచర్ల

పారదర్శకమైన ఓటర్ల జాబితా కోసం రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని నియోజకవర్గ ఎన్నికల అధి కారి శ్రీరామచంద్రమూర్తి కోరారు. బుధవారం పట్టణం లోని పలు ప్రాంతాల్లో ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పు లు, తొలగింపుల కోసం అందించిన ఆర్జీలపై క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సయ్యద్ హుస్సేన్, కమిషనర్ ఇవి రమణబాబు, ఎలక్షన్ డిటి బాషా, సచి వాలయ ఆడ్మిన్ శ్రీలక్ష్మి, బిఎల్ఒలు పాల్గొన్నారు.



స్టేమి ఇంజెక్షన్‌ను చూపుతున్న మంత్రి అంబటి రాంబాబు

ఏరియా ఆస్పత్రిలో స్టెమీ ఇంజెక్షన్ : మంత్రి రాంబాబు

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ వైద్యరంగంలో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. గుండె జబ్బుతో బాధపడే వారికి అవసరమైన వైద్యాన్నిసైతం స్థానిక ఏరియా వైద్యశాలలో అందుబాలులోకి తెచ్చినట్లు చెప్పారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన పరికరాలను మంత్రి బుధవారం పరిశీలించి మాట్లాడారు. గుండెపోటుకు గురైన రోగులకు గోల్డెన్ అవర్ చాల అమూల్యమైనదని, అటువంటి రోగులకు కార్పొరేట్ వైద్యశాలలో తక్షణం చేసే రూ.40 వేల విలువైన ఇంజెంక్షన్‌ను ప్రభుత్వ ఆస్పత్రిలో అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. ఇందుకోసం ఆసుపత్రిలో ప్రత్యేక గది, ప్రత్యేక శిక్షణ పొందిన సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారన్నారు. పట్టణానికి చెందిన ఓ మహిళ ఛాతీ నొప్పితో ఏరియా ఆస్పత్రికి మంగళవారం రాగా ఆమెకు ఇసిజి తీసి స్టేమి ఇంజెక్షన్ ఇచ్చి ప్రాణాపాయం నుండి కాపాడారని, అనంతరం గుంటూరుకు తరలించారని వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ కొత్త రామకృష్ణ, వైద్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కె.శ్రీలత

తక్కువ ఖర్చుతోనే పోషకాహారం

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని కొత్తపేట 1, 2, 3 వార్డుల్లో బుధవారం పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఐసిడిఎస్ సూపర్వైజర్ కె.శ్రీలత మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నాఉలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తక్కువ ఖర్చుతో లభించే ఆకుకూరలు, కూరగాయలు, పప్పు దినుసులు, చిరుధాన్యాలు, పడ్లు ఆహారంగా తీసుకోవాలని సూచించారు. తద్వారా రక్తహీనతను అధిగమించొచ్చన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం బి.ప్రభాకర్‌రావు, కౌన్సిలర్ బి.వీరమ్మ, రామిరెడ్డి, కోటేశ్వరరావు, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిఇంటికీ వెళ్లి వైద్య పరీక్షలు చేయాలి

ప్రజాశక్తి - రెంటచింతల

ఈ నెల 15వ తేదీ నుంచి చేపట్టే జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పల్నాడు జిల్లా డిడిఓ, ఇన్‌ఛార్జి ఎంపిడిఓ మహాలక్ష్మి కోరారు. ఈ మేరకు వైద్యారోగ్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో బుధవారం సమీక్షించారు. 15వ తేదీ నుంచి ప్రతి వాలంటీరు, ఆశా కార్యకర్తలు ప్రతిఇంటికీ వెళ్లి కుటుంబ సభ్యులకు ఏమైనా వ్యాధులతో బాధపడుతున్నారా? అని తెలుసుకొని ఎంఎల్‌హెచ్‌పిని పంపించి వైద్యం అందించాలన్నారు. షుగరు, బిపి, పక్షవాతం లక్షణాలు, కిడ్నీకి సంబంధించి పూర్తి వివరాలను సేకరించి మెడికల్ కిట్ అందిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు కృష్ణారెడ్డి, ప్రదీప్‌రెడ్డి, హేమ పాల్గొన్నారు.

అనాదిగా ఎదుగూబొదుగు లేని బతుకులు

- దుర్భర దారిద్ర్యంలో రెడ్డి యానాది సామాజిక తరగతి
- సాధారణ పనులకూ నోచుకోని దైన్యం
- మహిళల అత్తెసరు ఆదాయంతోనే కుటుంబాల జీవనం
- దయనీయ పరిస్థితిలో నివాస ప్రాంతాలు

బతకడానికి సరైన పనులు దొరకవు.. శుభ్రంగా ఉందామన్నా అందుకు కావాల్సిన వాతావరణం, ఆర్థిక వనరులూ ఉండవు.. ఈ పూట గడిస్తే చాలు.. అందరికీ కడుపు నిండితే చాలు.. అని దినదిన గండంగా సాగే జీవితాలు.. వెలివేయకుండానే వేలివేసినట్టు దుర్భర దారిద్ర్యంలో రెడ్డి యానాది సామాజిక తరగతికి చెందిన వారు జీవిస్తున్నారు.

ప్రజాశక్తి - చిలకలూరిపేట

కాలనీలోని ఓ వీధి దుస్థితి

పట్టణంలోని 25వ వార్డు జాగుపాలెంలో వాగు కరకట్ట దిగువన రెడ్డి యానాది సామాజిక తరగతికి చెందిన 40 కుటుంబాలు 70 ఏళ్లుగా పూరిగుడిసెలు వేసుకుని ఉంటున్నాయి. స్త్రీలు అయితే సమీప ఇళ్లల్లో ఇంటి పనులకు వెళ్తుంటారు. ఇందుకుగాను నెలకు రూ.రెండు వేల నుండి రూ.2500 వరకూ వస్తాయి. పురుషులైతే ఓగేరు వాగులో చేపలు పట్టుకుని వాటిని పట్టణంలో ఎక్కడో ఒకచోట రోడ్డు పక్కన పెట్టుకుని అమ్ముకుంటారు. అన్నీ అమ్ముడైతే రూ.300-400 వరకూ వస్తాయి. ఈ పనీ నెలలో సగం రోజులకు మించి ఉండదు. మార్కెట్ ఉన్నా అందులో వీరికి అమ్ముకునే అవకాశం ఇవ్వడం లేదు. మహిళల ఆదాయమే కుటుంబ జీవనానికి ప్రధానం. దీంతోపాటు ఇళ్లల్లో పని చేసి వచ్చేటప్పుడు యజమానులు ఏదైనా తినడానికి ఇస్తే దానితో కడుపు నింపుకుంటారు. ఇతరుల మాదిరే వేరే పనులు చేసుకుందామంటే తమనెవరూ పనులకు పిలవరని, తామే వెళ్లి అడిగినా పనిలో పెట్టుకోరని ఇక్కడి వారు చెబుతున్నారు.

ఈ ప్రాంతంలో సుమారు 40 మందికిపైగా చిన్నపిల్లలున్నారు. వీరిలో కొంతమందికి వేద అనే సంస్థ పాఠశాల నిర్వహిస్తుండగా మరికొందరు సమీపంలోని ప్రభుత్వ పాఠశాలకు వెళ్తున్నారు. సుమారు 15 మంది మాత్రం చదువుకు నోచడం లేదు. ఈ ప్రాంతంలో అపారిశుధ్యం రాజ్యమేలుతోంది. రోడ్లు, నీరు, వీధి దీపాలు, సరైన డ్రెయినేజీ సదుపాయం ఏమీ లేదు. వర్షం వస్తే బురదలోనే రాకపోకలు సాగించాలి. నిత్యం దుర్గంధం వెదజల్లుతూ ఉంటుంది. విషపురుగులు సంచరిస్తుంటాయి. ఈ ప్రాంతానికి నీటి సదుపాయమూ లేదు. స్థానికంగా కొద్ది దూరంలో ఉన్న ఒక బోరింగే అన్ని కుటుంబాల నీటి అవసరాలకూ ఆధారం. తాగు నీటికి ఒక మున్సిపల్ ట్యాపు ఉంది.

వీరిలో కొంతమందికి జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు ఇచ్చినా ఆ స్థలాలు ఎక్కడున్నాయో కూడా వీరికి తెలియదు. ఇళ్లు నిర్మించుకునే స్తోమత అసలే లేదు. పెరిగిన ధరలు, తమ ఆదాయాలను చూసుకుంటే రూ.10 రూపాయలు పెట్టి తలకు కొబ్బరి నూనె కొనుక్కోవడానికీ తాము వెనకాడాల్సి వస్తోందని, ఇక ఇంటి నిర్మాణం అంటే సాధ్యం కానిపని అని ఇక్కడి వారు చెబుతున్నారు. పైగా ఆ స్థలాల్లోకి వెళ్లి ఉంటే ఇప్పుడున్న కొద్దిపాటి పనులు కూడా దొరకవని, ఒకవేళ పనికి వచ్చి వెళ్లాలన్నా ఏడెనిమిది కిలోమీటర్లపాటు ఛార్జీలు పెట్టుకుని తిరగడానికి తమకు వచ్చే ఆదాయం కూడా చాలదని వాపోతున్నారు. తాము ఇప్పుడు ఉంటున్న ప్రాంతంలోనే మెరకలు తోలించి ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, తాము వాగులో పట్టిన చేపలను మార్కెట్‌లో అమ్ముకునే వీలు కల్పించాలని వీరు కోరుతున్నారు. ఆర్థికంగా, సామాజికంగా వీరిని అభ్యున్నతి దిశగా నడిపించడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సి ఉంది. మౌలిక వసతుల కల్పన, చిన్నారులకు చదువులపై శ్రద్ధ అవసరం. అదే జరిగితే తమకు అంతకంటే కావాల్సింది ఏముంటుందని ఇక్కడివారు కోరుకుంటున్నారు. ఇదిలా ఉండగా సరైన ఇళ్లే లేని తమకు ఏడు కరెంటు మీటర్లు ఉన్నాయంటూ అమ్మఒడి, పింఛను తదితర పథకాలకు అనర్హులను చేశారని, అధికారులను సంప్రదించినా ప్రయోజనం లేకుండా పోయిందని పలువురు వాపోతున్నారు.

రెండు బృందాలుగా 4 దశల్లో జగనన్న సురక్ష

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. ఈ అంశంపై సిఎంతో వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక కలెక్టరేట్ నుండి కలెక్టర్‌తోపాటు జెసి శ్యాంప్రసాద్ పాల్గొన్నారు. కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షను 4 విడతలుగా నిర్వహించనున్నట్లు చెప్పారు. తొలి విడతగా ఈ నెల 15 నుండి ప్రజా ప్రతినిధులు, గృహసారథులు, వాలంటీర్లు ప్రతి ఇంటినీ సందర్శించి ఆరోగ్య వివరాలు సేకరించాల్సి ఉంటుందని, వైద్యం పొందానికి ఆరోగ్యశ్రీపైనా అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామానికి రెండు బృందాలు ఉండి ఒక బృందం ఎ.ఎన్.ఎం ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు-2, వాలంటీర్, రెండవ బృందం హెల్త్ ఆఫీసర్ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు, వాలంటీర్లు కలిసి పర్యటిస్తారని అన్నారు. రక్త, మూత్ర, గళ్ల, బిపి, షుగర్, మలేరియా, డెంగీ తదితర ఏడు రకాల పరీక్షలు నిర్వస్తారన్నారు. మూడవ విడతగా మెడికల్ క్యాంప్ నిర్వహణకు మూడు రోజుల ముందు ప్రజా ప్రతినిధులు, గృహ సారథులు, వాలంటీర్లు మెడికల్ క్యాంప్‌పై అవగాహన కల్పిస్తారన్నారు. నాల్గవ విడతలో వైద్యశిబిరం నిర్వహించి పరీక్షలు చేయడంతోపాటు అవసరమైన వారికి మందులు, కళ్లజోళ్లు అందిస్తారని అన్నారు. దీర్ఘ కాలిక వ్యాధులతో బాధపడేవారిని వారికి అవసరమైన నిరంతర సేవలు అందేలా చూస్తారన్నారు. ఈ కార్యక్రమాలన్నీ 45 రోజుల్లో ముగించాల్సి ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి.రవి, డిసిహెచ్ఎస్. డాక్టర్ రంగారావు, ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ సునీలా, ఐసిడిఎస్ అధికార అరుణ, పల్నాడు అర్బన్ డవలప్మెంట్

కాన్ఫరెన్స్‌లో పల్నాడు జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు

వినీ శ్రీనివాసులరెడ్డి, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

15వ తేదీకి నవోదయం మార్పు

పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆధ్వర్యంలో ప్రతినెలా 14వ తేదీన నిర్వహించే 'నవోదయం' కార్యక్రమం మినీ జాబ్ డ్రైవ్ మేళాను ఈనెల 15వ తేదికి మార్పు చేసినట్లు నవోదయం కార్యక్రమ నోడల్ అధికారి సంజీవరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువత తమ విద్యార్హత పత్రాలతో కలెక్టర్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

నియంత్రించకుంటే పెట్టుబడి ఖర్చూ రాదు

ప్రజాశక్తి-ముప్పాళ్ల

గులాబీ రంగు పురుగు ఉధృతిని నియంత్రించకుంటే రైతులకు పెట్టుబడి ఖర్చు కూడా రాదని పల్నాడు జిల్లా డేటా సెంటర్ శాస్త్రవేత్త డాక్టర్ రమేష్ అన్నారు. మండలంలోని చాగంటివారిపాలెంలోని పత్తి పొలాలను ఆయన బుధవారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. పత్తికి నష్టం కలిగించే చీడపీడల్లో గులాబీ పురుగు ప్రధానమైనదని, దీనివల్ల దిగుబడులు తగ్గటంతోపాటు, పంట నాణ్యతా దెబ్బతింటుందని అన్నారు. ఈ పురుగు ఆశించిన పూలు, మొగ్గలు రాలిపోతాయని, పత్తికాయలు ముదరక ముందే పక్వానికి వచ్చి విచ్చుకుంటాయని అన్నారు. కొన్ని జాగ్రత్తల ద్వారా పురుగు ఉధృతిని నివారించొచ్చని చెప్పారు. పురుగును, గుడ్డు దశలను నిర్మూలించేందుకు లీటరు నీటికి 5 మిల్లీ లీటర్ల వేపనూనెను కలిపి పిచికారి చేయాలన్నారు. పురుగు ఉధృతి తగ్గడానికి ప్రోఫినోఫోస్ 50 శాతం ఈసి 400 మిల్లీలీటర్లు లేదా నోవాలురాన్ 5.25 శాతం గల దానితో ఇండాక్సీక్రాప్ 4.5 శాతం గల 400 మిల్లీలీటర్లను 200 లీటర్ల నీటితో కలిపి ఉదయం గానీ లేదా సాయంత్రం వేళల్లో పిచికారీ చేయాలని సూచించారు. పురుగు ఉధృతి తగ్గకుంటే పంట వేసి 100 రోజులు దాటితే లాంబ్డా సైహలోత్రిన్ 5 శాతం ఈసి 400 మిల్లీ లీటర్లను 200 లీటర్ల నీటికి కలిపి ఒక ఎకరానికి పిచికారి చేయాలని,

పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త

కానీ ఈ సింథటిక్ పైరిత్రాడ్స్‌ను పంట అవసాన దశలో అనగా 100 రోజులు దాటినా తరువాత మాత్రమే పిచికారి చెయ్యాలని వివరించారు. లేకుంటే రసం పీల్చే పురుగుల ఉధృతి ఎక్కువ అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏవో అరుణ, అగ్రి అసిస్టెంట్ శైలజ, రైతులు పాల్గొన్నారు.

త్వరలో టెన్తు విద్యార్థులకు స్టడీ మెటీరియల్

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

టెన్తు విద్యార్థులకు గత ఏడాది కంటే ఈ ఏడాది ముందుగానే స్టడీ మెటీరియల్ అందిస్తామని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా తెలిపారు. పెదకాకాని మండలం నంబూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగాజరిగాయి. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. క్రిస్టినా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని ఎంతో

పాల్గొన్న విద్యార్థులు

సభలో ప్రసంగిస్తున్నజెడ్‌పి చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

మంది గొప్ప వాళ్ళు అయ్యారని తెలిపారు. పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు ఈ పాటశాలకు చేస్తున్న పనులను అభినందించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ సంవత్సరం 10 వ తరగతి విద్యార్థులకు ఆల్‌ఇన్ వన్ స్టడీ మెటీరియల్ ను తప్పకుండా ముందుగానే అందిస్తామన్నారు. పిల్లలందరూ బాగా చదువుకుని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని తెలియజేశారు. ప్రతి తరగతి లో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా విచ్చేసిన చైర్ పర్సన్ క్రిస్టినా విద్యార్థులు పూలతో ఘన స్వాగతం పలికారు, అనంతరం నంబూరు జిల్లా పరిషత్ పాటశాల పూర్వ విద్యార్థుల సంఘం వారి సహకారం తో రు.4.లక్షల లతో నిర్మించిన కాంక్రీటు ఫ్లోరింగ్ ను ఆమె ప్రారంభించారు. ఆర్‌జెడి సుబ్బారావు విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

సాంకేతికత దేశాభివృద్ధికి కీలకం : ఎమ్మెల్సీ కెఎస్

ప్రజాశక్తి - తెనాలి

వివివిటీలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

దేశ అభివృద్ధిలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల నంబూరులో బుధవారం ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యా

వర్సిటీ సమస్యలు పరిష్కరించాలని రెక్టార్‌కు ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రెక్టార్ పి వరప్రసాద్ మూర్తిని కలిసి బుధవారం వినతి పత్రం సమర్పించారు. వర్సిటీ మెయిన్ క్యాంటీన్ లో గల మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని కోరారు. అడ్మిషన్ల సమయంలో వచ్చే తల్లిదండ్రులకు ఎదురవుతున్న సమస్యల నేపథ్యంలో మరుగుదొడ్లను శుభ్రపరచాలని కోరారు. విద్యార్థులకు కోసం వచ్చే తల్లిదండ్రులకు వసతి సౌకర్యం కూడా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ అధ్యక్ష కార్యదర్శులు డి సంతోష్ కె ఆదిశేషు ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ ఉపాధ్యక్షులు డి ప్రవీణ్ ఎస్ఎఫ్ఐ నాయకులు శ్యామ్ దుర్గాప్రసాద్ యూనివర్సిటీ గర్ల్స్ కన్వీనర్ వందన తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుండి జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యసేవలు అందించాలన్న లక్ష్యంతో చేపట్టనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా నిర్వహించేందుకు వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, మండలస్థాయి అధికారులు, జిల్లా స్థాయి అధికారులు సమన్వయంతో కషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం, అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై మున్సిపల్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామల్లో, పట్టణాల్లోని ప్రజల ఆరోగ్య సమస్యలను గుర్తించి వారికి అవసరమైన వైద్యసేవలు అందించేందుకు సెప్టెంబరు 30వ తేది నుండి జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు గ్రామల్లోను, పట్టణాల్లోను నిర్వహించటం జరుగుతుందన్నారు. కావున వాలంటీర్లు, గృహసారధులు, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు సెప్టెం బరు 15 నుంచి ఇంటింటికీ వెళి ప్రజలకు ఆరోగ్య సురక్షపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో సెప్టెంబరు 29వ తేదీన పైలెట్‌గా గ్రామీణ, పట్టణంలోని ఒక ప్రాంతంలో

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహణకు వైద్యారోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పేదలందరికీ ఇళ్ల పథకంలో ఇళ్ల నిర్మాణం, మౌలిక సదుపాయాలు, గడప గడపకు మన ప్రభుత్వంలో మంజూరు చేసిన పనులు, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు, పీఎం కిసాన్ ఈకేవైసీ, ఈక్రాప్ బుకింగ్ తదితర అంశాపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ ఎ.శ్రావణ బాబు, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, జెడ్పీ సీఈఓ మోహనరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎన్ వెంకటేశ్వర్లు, పంచాయితీ రాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య పాల్గొన్నారు.

ఎక్స్‌రే క్యాసెట్లను సమకూరుస్తాం

జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రి రేడియాలజీ విభాగంలో రోగులకు ఇబ్బందులు లేకుండా పని చేయాలనీ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ సూచించారు. తన చాంబర్‌లో బుధవారం రేడియాలాజి విభాగంతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రింటర్, స్కానర్‌ను హెచ్‌డిఎస్ నిధుల నుంచి కొనుగోలు చేయాలనీ సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఎక్స్ రే క్యాశెట్ల కొరతను కూడా తీరుస్తామని ఆయన చెప్పారు. ఆరోగ్య శ్రీ నిధుల ద్వారా ఎక్స్‌రే క్యాసేట్లను తెప్పించడానికి నిర్ణయం తీసుకున్నామని ఆయన చెప్పారు. రూ. అయిదు లక్షల విలువ గల ఎక్స్‌రే క్యాసేట్లను ఆరోగ్య శ్రీ ద్వారా సమాకుర్చుకోవాలని త్వరితగతిన ఎక్స్ రే జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. రేడియాలజీ విభాగం ఓపిలో రోగులకు అసౌకర్యం జరగకుండా హెచ్ ఓ డి ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని ఆయన సూచించారు. అదేవిధంగా ఓపి లో స్కానింగ్, ఎక్స్‌రేల పర్యవేక్షణ కోసం అసిస్టెంట్ ప్రొఫెసర్, అత్యవసర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌ల పర్యవేక్షణలో ఎక్స్‌రే, స్కానింగ్ పరీక్షలు జరగాలని, ఎక్స్ రే మిషన్‌ల వద్ద సహాయకులు గా నర్సింగ్ సిబ్బంది, ఫార్మిడి విద్యార్థులను అందుబాటులో ఉంచాలని ఆయన కోరారు.

లెమన్ మర్చంట్స్ అసోసియేషన్ నాయకులు

సాంబశివరావు కన్నుమూత

ప్రజాశక్తి-తెనాలి : పట్టణానికి చెందిన ప్రముఖ నిమ్మ కాయల వ్యాపారి, సౌత్ ఇండియన్ లెమన్ మర్చంట్స్ అసోసియేషన్ కార్యదర్శి పాలేటి సాంబ శివరావు (71) బుధవారం మృతి చెందారు. సాంబ శివరావు గతంలో మార్కెట్ యార్డు ఉపాధ్యక్షు లుగా, తెనాలి లెమన్ మర్చంట్స్ అసోసి యేషన్ అధ్యక్షులుగా కూడా పనిచేశారు. స్థానిక నందులపేటలోని స్వగృహంలో ఆయన మృతదేహానికి పలువురు నివాళులర్పించారు.

కెఎల్‌యు యోగా టీచర్‌కు బంగారు పతకం

ప్రజాశక్తి,తాడేపల్లి రూరల్

ఎపి స్టేట్ యోగాసనా స్పోర్ట్స్ చాంపియన్ షిప్ లో కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో యోగా శిక్షకురాలిగా పనిచేస్తున్న కె.పూజితకు బంగారు పతకం వచ్చినట్లు కెఎల్‌యు క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరికిషోర్ బుదవారం ఒక ప్రకనలో తెలిపారు. కర్నూలులో ఈ నెల 9 నుండి 11 వరకు జరిగిన ఈ చాంపియన్ షిప్‌కు రాష్ట్ర నలుమూలల నుండి యోగా గురువులు, విద్యార్థులు పాల్గొన్నారని ఆయన అన్నారు. కాగా తమ విశ్వవిద్యాలయానికి చెందిన యోగా శిక్షకురాలు కె.పూజిత



పూజితను, విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల విభాధిపతులు

ప్రథమ స్థానం కైవసం చేసుకుని బంగారు పతకం సాధించగా ఆమెతో పాటు పోటీల్లో పాల్గొన్న కెఎల్ యు విద్యార్థులు మరో రెండు పతకాలను సాదించారని అన్నారు. వారిలో మెకానికల్ విభాగంలో 4వ సంవత్సరం చదువుతున్నా కె.అజయ్ మూడవ స్థానం, కంప్యూటర్ సైన్స్ విభాగంలో 4వ సంవత్సరం చదువుతున్న వి.చంద్రశేఖర్ 5వ స్థానం సాధించారని తెలిపారు. వీరికి కెఎల్ వర్శిటీ ప్రొఫెసర్ చాన్సలర్ డాక్టర్ కెఎస్.జగన్నాథరావు, వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారదివర్మ, ప్రొఫెసర్ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎవిఎస్. ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విధ్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు, డీన్ సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్, క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరికిషోర్ అభినందనలు తెలిపారు.

కెఎల్‌యు పరిశోధకులు చాంద్‌బాషాకు అరుదైన గౌరవం

అంతర్జాతీయ జర్నల్‌కు అసోసియేట్ ఎడిటర్‌గా ఎంపిక

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

డీమ్డ్ యూనివర్శిటీ బయోటెక్నాలజీ విభాగంలో పరిశోధనా విభాగంలో పనిచేస్తున్న డాక్టర్ షేక్ చాంద్ భాషాకు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌవరం లభించింది. ప్రపంచ దేశాలలో ఉన్న ప్రముఖ యాంజియో థెరఫీ శాస్త్రవేత్తలు నిర్వహిస్తున్న యాంజియో థెరఫీ జర్నల్‌కు అసోసియేట్ ఎడిటర్‌గా చాంద్‌బాషాను ప్రకటించారు. ఆస్ట్రేలియా, మలేషియా, ఇరాక్ వంటి దేశాలకు చెందిన యాంజియో థెరఫీ శాస్త్రవేత్తల సరసన భారతదేశం నుండి మొట్ట మొదటి పరిశోధకుడిగా డాక్టర్ షేక్ చాంద్ భాషా ఎంపిక కావడం పట్ల వర్శిటీ ప్రతినిధులు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వడ్డేశ్వరం లోని కెఎల్ డీమ్డ్ టు బి యూనివర్శిటీ బయో టెక్నాలజీ విభాగంలో పోస్ట్-డాక్టోరల్ రీసెర్చ్ ఫెలో గా పనిచేస్తున్న డాక్టర్ షేక్ చాంద్ బాషా, ప్రముఖ బహుళ-క్రమశిక్షణా అంతర్జాతీయ జర్నల్‌లో ఒకదానికి అసోసియేట్ ఎడిటర్‌గా ఎంపిక చేయబడ్డారని బయో టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.శ్రీనివాసులు బుధవారం ప్రకటనలో తెలిపారు. న్యూరోడెజెనరేటివ్ డిజార్డర్స్‌లో డాక్టర్ చాంద్ బాషా చేసిన కృషిని గుర్తించి, జర్నల్‌కు అసోసియేట్ ఎడిటర్‌గా ఆహ్వానించారని అన్నారు. అల్జీమర్స్ వ్యాధిలో టెర్మ్ 2 మాడ్యులేటర్ల యొక్క చికిత్సా సామర్థ్యాన్ని అర్థంచేసు కోవడం పరిశోధన యొక్క మొత్తం లక్ష్యమని అన్నారు. ఈ సంధర్భంగా డాక్టర్ చాంద్ భాషాను వర్సిటీ ప్రొఫెసర్‌లు డాక్టర్ కెఎస్ జగన్నాధరావు, విసి పార్థసారధివర్మ తదితరులు అభినందించారు.

వాలంటీర్ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న డిప్యూటీ కమిషనర్

వార్డు వాలంటీర్ల పోస్టులకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిఎంసి పరిధిలోని వార్డు సచివాలయాల్లో ఖాళీగా ఉన్న వార్డు వాలంటీర్ల పోస్టులకు మంగళవారం, బుధవారం డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఖాళీ పోస్టులకు ఆన్‌లైన్ ద్వారా 301 మంది దరఖాస్తు చేసుకున్నారని, వారిలో కొందరికి సరైన ధృవపత్రాలు లేనందున 88 దరఖాస్తులు రిజెక్ట్ చేయడం జరిగిందని కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తుల పరిశీలన అనంతరం 212 మందిని అర్హులుగా ప్రకటించగా వారిలో 116 మంది ఇంటర్వ్యూకి హాజరయ్యారన్నారు. వాలంటీర్లుగా ఎంపికైన ఈ నెల 15 నుండి విధుల్లోకి చేరాల్సి ఉంటుందన్నారు.

రేపు కుట్టుశిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి-తాడేపల్లి

మహిళా నైపుణ్య కుట్టు శిక్షణా కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న కుట్టుశిక్షణకు మహిళల నుంచి విశేష స్పందన లభిస్తుంది. తాడేపల్లి మేకా అమరారెడ్డిభవన్‌లో రేపు ఉదయం పది గంటలకు కాన్ఫడరేషన్ ఆఫ్ అపార్టుమెంట్ అసోసియేషన్ (క్యాట్) అధ్యక్షులు జిఎస్ఆర్ మోహనరావు, విశ్రాంత సైనికోద్యోగి గోపాలం సాంబశివరావు ప్రారంభిస్తారని నిర్వాహకులు చింతా వెంకటరత్నం, గాదె సుబ్బారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రాల రాష్ట్ర కన్వీనర్ పి.మురళీకృష్ణ, విజయవాడ ఎంబి విజ్ఞాన కేంద్రం బాధ్యులు పి.విజయ, తాడేపల్లి మాజీ సర్పంచ్ దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, ఎంటిఎంసి బాలోత్సవం కార్యదర్శి పి.శ్రీలక్ష్మి పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా శిక్షణా కేంద్రం నిర్వాహకులు వెంకటరత్నం, సుబ్బారెడ్డి మాట్లాడుతూ మహిళలు తమ కాళ్ల మీద తాము నిలబడటానికి ఇటువంటి శిక్షణా శిబిరాలు ఉపయోగపడతాయని చెప్పారు. మహిళలు ఆర్థిక స్వాలంబన దిశగా ఓ అడుగు ముందుకు వేయడానికి అవకాశం ఉంటుందని చెప్పారు.

లింగారావుపాలెం జెడ్పి పాఠశాలలో తనిఖీ

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని లింగారావుపాలెం జెడ్పి పాఠశాలలో బుధవారం ఉదయం నరసరావుపేట ఉప విద్యాశాఖాధికారి కె.వేణుగోపాల్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రగతి ని సమీక్షించారు. ఐఎఫ్పి బోర్డులు, టాబ్ లను ఉపయోగిస్తున్న తీరును, మధ్యాహ్న భోజనాన్ని, విద్యార్థుల నోటు పుస్తకాలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. విద్యార్థుల ప్రగతి ని సమీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు.

మాజీ ఎంపిటిసి భార్య మృతి.. వైసిపి నివాళి

ప్రజాశక్తి-కారంపూడి

మాజీ ఎంపిటిసి కడియం ఏబేలు భార్య పుల్లమ్మ మంగళవారం సాయంత్రం మృతి చెందారు. పుల్లమ్మ పార్థివదేహాన్ని సందర్శించిన పల్నాడు జిల్లా వైసిపి యువ నాయకుడు చిరుమామిళ్ల. శ్రీకాంత్ నివాళులర్పించారు. మొదటి నుండి ఏబేలు కుటుంబం వైసిపికి అనుకూలం అని అన్నారు. ఆమె కుటుంబసభ్యులు భూషణంను ఓదార్చారు. వైసిపి యువజన విభాగం తరపున మట్టిఖర్చులకు పది వేల రూపాయలను ఆయన అందజేశారు.నివాళులర్పించిన వారిలో షేక్. మస్తాన్, మిద్దెపోగు. యాకోబు, సుదర్శన్, రవి, సీతరామిరెడ్డి, కార్తీక్, జావీద్, వాల్మీకి నరేంద్ర, చోటా. కరీమ్, లింగప్ప, కోటయ్య ఉన్నారు.

మృతుడి కుటుంబానికి చెక్కు అందజేత

ప్రజాశక్తి-పెదకూరపాడు

మండలంలోని ఖమ్మంపాడు గ్రామానికి చెందిన కుంభ అనిల్ కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాడు. బుధవారం అనిల్ కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి 3 లక్ష రూపాయల చెక్కును ఎమ్మెల్యే వారి ఇంటికి వెళ్లి అందించారు. ఆయన వెంట ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, నాయకులు కె.శివాజీ, ఎ. నాగయ్య ఉన్నారు.

సైబర్ నాలెడ్జ్ పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - అమరావతి

అమరావతి మండల కేంద్రంలోని గుడ్ షెఫర్డ్ సిస్టర్స్ వారి ఆధ్వర్యంలో సైబర్ నాలెడ్జ్ పై అవగాహనకార్యక్రమంలో మునుగోడు జడ్పీహెచ్ఎ గ్రామ స్కూల్ లో మరియు ఏపీ ఆర్ ఎస్ డబ్ల్యూ ఫర్ గర్ల్స్ అమరావతి వెలుగు స్కూల్లోనూ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి సిస్టర్ విన్నరసి అధ్యక్షత వహించారు ముఖ్య అతిథులు గా మునుగోడు ప్రధానోపాధ్యాయులు కె.వెంకటేశ్వర్లు,ఇందిరా ప్రియదర్శిని వ్యవహరించారు. రిసోర్స్ పర్సన్ గా ఎన్. దిలీప్ కుమార్ మాట్లాడుతూ ఫోన్ వాడేటప్పుడు ఇంటర్నెట్ వినియోగించే టప్పుడు చాలా జాగ్రత్తలుపాటించాలని సూచించారు.

గణేష్ విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

- వినాయక ఉత్సవాలకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు
- నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు
- ఎస్పీ వై రవిశంకర్ రెడ్డి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

వినాయక చవితి సందర్భంగా విగ్రహాలు ఏర్పాటు చేసేవారు పోలీసులు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని నిబంధనలు తప్పనిసరిగా అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పల్నాడు జిల్లా ఎస్పీ వై రవి శంకర్ రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయం నుండి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గణేష్ ఉత్సవాలకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేస్తున్నామని, అవాంఛనీయ ఘటనకు తావివ్వకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. విగ్రహాల ఏర్పాటుకు పోలీసులు అనుమతి పొందాలని, రోడ్లపై విగ్రహాలు ఏర్పాటు చేయవద్దని, ప్రభుత్వ స్థలంలో అయితే అధికారి అనుమతి పత్రం, ప్రైవేట్ స్థలంలో అయితే యజమాని అనుమతి పత్రంతో పాటు పోలీసు నిబంధనలు అనుసరిస్తామన్న అఫిడవిట్‌ను విగ్రహ కమిటీ సభ్యులు దరఖాస్తు చేస్తేనే అనుమతులు లభిస్తాయని వివరించారు. కమిటీ సభ్యులుగా కనీసం 5 మందికి తగ్గకుండా ఉండాలని, పోలీసులు అనుమతితో పాటు అగ్నిమాపక , విద్యుత్ శాఖ అధికారుల అనుమతులు కూడా పొందాలన్నారు. మండపంలో కచ్చితంగా కనీసం రెండు డ్రమ్ముల ఇసుక, నీరు నిల్వ ఉంచాలన్నారు. అనుభవం కలిగిన ఎలక్ట్రిషన్‌తో లైటింగ్ పనులు చేయించాలని సూచించారు. బడి, గుడి, కళాశాల మసీదు, చర్చి ఇతర ప్రార్థనా మందిరాలకు, హాస్పిటల్స్ కు దూరంగా విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మండపాల వద్ద డీ జేలు, రాజకీయ పార్టీల పాటలు, జెండాలు పూర్తిగా నిషిద్ధమని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలకు సంబంధించి సినిమా పాటలు, రాజకీయ పార్టీల పాటలు నిషేధమని తెలిపారు. ఆధ్యాత్మిక గేయాలు, గీతాలు, కథలు , నాటక ప్రదర్శనలు, కోలాటం మొదలైనవి ప్రదర్శించాలని స్పష్టం చేశారు. ప్రదర్శనకు ముందస్తు పోలీసు అనుమతులు విగ్రహ కమిటీ సభ్యులు పొందాల్సి ఉంటుందన్నారు. ఏ వాహనంలో విగ్రహాన్ని నిమజ్జనానికి ఊరేగిస్తారో, ఆ వివరాలు చెప్పాలని నిమజ్జనానికి నిర్దేశించిన ప్రాంత వివరాలను కూడా పోలీసులకు తెలియజేయాలని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో చేసిన విగ్ర హాలు కాకుండా మట్టి విగ్రహాలను పూజించాలని సూచించారు.

నూతనంగా మంజూరైన పింఛన్లు పంపిణీ

పెదకూరపాడులో పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

ప్రజాశక్తి -పెదకూరపాడు

ప్రజా సంక్షేమం, అభివృద్ధి మరిచి, దోచుకునేవాళ్లను దాచుకునేవాళ్లను నమ్మొద్దని పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. బుధవారం పెదకూరపాడులో నూతనంగా మంజూరైన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మండలంలో నూతనంగా మంజూరైన 230 మందికి పెన్షన్లు అందజేశారు. జగనన్న పాలనలో ప్రతి పేదవాడికి ఇంటి ముందుకే సంక్షేమ పథకాలు అం దిస్తున్నామని, పెదకూరపాడు లిఫ్ట్ ఇరిగేషన్లు కూడా నిర్మిస్తామని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం అమరావతి - బెల్లంకొండ రోడ్డు, అమరావతి-తుళ్లూరు రోడ్డు నిర్మిస్తున్నామని, త్వరలోనే కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణం కూడా ప్రారంభిస్తామన్నారు. భవిష్యత్తులో ఈ నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా మారుస్తానని హామీ ఇచ్చారు.

సామాజిక పింఛన్లతో కుటుంబాలకు చేయూత

ప్రజాశక్తి - రెంటచింతల

ప్రభుత్వం అందజేస్తున్న సామాజిక పింఛన్లు కుటుంబాలకు ఎంతో చేయూతనిస్తాయని రెంటచింతల సర్పంచ్ పూజల పుష్పవతి రామయ్య అన్నారు. స్థానిక పంచాయతి కార్యాలయంలో బుధవారం 80 మందికి నూతనంగా మంజూరైన పెన్షన్లను అందజేశారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతనంగా 462 పింఛన్లు మంజూరయ్యాయని, ఇప్పటిదాకా ఇస్తున్న 6,617 పింఛన్లకు ఇవి అదనమని చెప్పారు. కార్యక్రమంలో మండల పరి షత్ ఉపాధ్యక్షులు శౌరిరెడ్డి, ఉమామహేశ్వరిరెడ్డి, ఏరువ విజయరెడ్డి పాల్గొన్నారు

ధరణికోటలో 54 మందికి పింఛన్లు

ప్రజాశక్తి - అమరావతి

మండలంలోని ధరణికోట సచివాలయం - 2 పరిధిలో నూతనంగా మంజూరైన 54 పెన్షన్లను లబ్ధిదారులకు పెన్షన్లను ఎమ్మెల్యే నంబూరు శంకర రావు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ధరణికోట పరిధిలో సుమారు రూ.43 లక్షల రూపాయలు ప్రతి నెలా వైఎస్ఆర్ పెన్షన్ కానుక ద్వారా అందిస్తున్నా మన్నారు. గత నాలుగేళ్లలో పెదకూరపాడు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు శాయశక్తులా కషి చేస్తున్నాన్నారు. రూ.150 కోట్లతో అమరావతి - బెల్లంకొండ డబుల్ లేన్ రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. గతంలో తెలుగుదేశం పార్టీ ఇందులో నాలుగో వంతు పెన్షన్లు అందించారా అని ప్రశ్నించారు. కార్యక్రమం అనంతరం ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా మంజూరైన టీవీఎస్ బైక్ ను లబ్ధిదారుడు లంకె గంగాధరరావుకు అందజేశారు.

రెంటచింతలలో పింఛన్ అందజేస్తున్న సర్పంచ్

ఎపిపిటిడి నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్‌కు

ప్రభుత్వ గుర్తింపు

ప్రజాశక్తి - వినుకొండ

ఎపిఎస్ఆర్టిసిలో అతిపెద్ద గుర్తింపు అసోసియేషన్ గా ఎపిపిటిడి నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ను ప్రభుత్వం గుర్తించి గౌరవ సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి పోలా భాస్కర్ ద్వారా జీవో నెంబర్: 96/12/09/23 ను ఇచ్చిన సందర్భంగా వినుకొండ డిపో మజ్దూర్ యూనియన్ కార్యాలయం లో గుర్తింపు వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయుఏ వ్యవస్థాపకులు పి. రామ్ మోహన్ రావు విగ్రహానికి యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ముప్పాళ్ళ శ్రీనివాసరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. యూనియన్ గౌరవ సలహాదారు బి.మోహన్ రావు మాట్లాడుతూ ఏపీఎస్ఆర్టీసీలో ఉన్న మొత్తం 53,000 మంది ఉద్యోగులు ఉండగా ఒక్క ఎన్ఎంయుఏ సభ్యత్వం 23,000 మంది ఉన్నారని, అందువల్ల ఆర్టిసి ఎండి ప్రభుత్వానికి సిఫార్సు చేయడం వల్ల ఎన్ఎంయు కు అతి పెద్ద యూనియన్ గా ప్రభుత్వం గుర్తింపు లభించిందని ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఇది ఎంతగానో దోహదపడుతుందని, ప్రతి ఉద్యోగి గర్వించదగ్గ విషయమని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి వి. శివ ప్రసాద్ నాయక్ అధ్యక్షులు బి సౌభాగ్యరాజు, చైర్మన్ పి వి ఎస్ ఆర్ మూర్తి, హరిహర బాబు, డి. శ్రీను, యోగి, సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఈ - క్రాప్ లేకుండా

పంట నష్టం వర్తించదు

ప్రజాశక్తి - కారంపూడి

రైతులు తప్పనిసరిగా ఈ - క్రాప్ బుకింగ్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బత్తుల. యలమందరెడ్డి తెలిపారు. ఈ ఖరీఫ్ సీజన్లో పంట నష్టం కలిగించే ఏదైనా విపత్తు సంభవించిన ఎడల ఈ - క్రాఫ్ బుకింగ్ నమోదు చేయకుండా ఏ విధమైన పంట నష్టం వర్తించదని ఆయన తెలిపారు. ఈ - క్రాఫ్ తో పాటు ఈ నెల 25వ తేదీ లోపు ఈ కేవైసీ కూడా చేయించు కోవాలని తెలిపారు. పీఎం కిసాన్ యోజన కింద ఈ-కేవైసీ చేయించుకోవలసినవారు ఈ నెలాఖరులోపు చేయించుకోవాలని సూచించారు. పీఎం కిసాన్ యోజన క్రింద మండలంలో సుమారు 600 మంది ఈ-కేవైసీ చేయించుకోవాలని చెప్పారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో పంట కాలవలు సకాలంలో రాకపోతే ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకునేందుకు రైతులు సమాయత్తం కావాలని, కంది, మినుములు, పెసలు సాగు చేసుకోవాలని సూచించారు. ఇందుకుగాను ప్రభుత్వమే సబ్సిడీ ద్వారా విత్తనాలు పంపిణీ చేస్తుందని అన్నారు.

జంగాలపల్లిలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు అందజేసిన చిత్రం

నోట్ బుక్స్, పెన్నులు అందజేత

ప్రజాశక్తి - వినుకొండ

మండలంలోని జంగాలపల్లిలోని ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు, ఇదే గ్రామానికి చెందిన కృష్ణం రాజు తన తండ్రి చక్రవరం కోట్లింగరాజు ద్వితీయ వర్ధంతి సందర్భంగా విద్యార్థులందరికీ నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్ బాక్సులు, పరీక్ష ప్యాడ్లు అందజేశారు. ముఖ్య అతిథిగా జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు కమలారామ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కమలారామ్ మాట్లాడుతూ విద్యార్థులందరూ క్రమశిక్షణతో, చక్కగా, శ్రద్ధగా విద్యను అభ్యసించి, భావి భారతపౌరులుగా ఎదగాలని కోరారు. కృష్ణంరాజు మాట్లాడుతూ విద్యా ర్థులందరూ బాగా చదువుకోవాలని, మంచి ఉద్యోగాలు చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ కూచిపూడి చినవెంకటేశ్వర్లు మాజీ ఎంపీటీసీ నాగులపాటి వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే. బాలబద్రా రెడ్డి, ఉపాధ్యాయులు కె.అజయ్‌కుమార్, ఉపాధ్యాయు ఐలు పివి. జయలక్ష్మి , కె.అనూరాధ పాల్గొన్నారు.

రహదారి విస్తరణ పనుల పరిశీలన

ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లి ప్రధాన రహదారి విస్తరణ పనులను మంగళగిరి శాసనసభ్యులు ఆళ్ళ రామకృష్ణా రెడ్డి ఇంజనీరింగ్, విద్యుత్ శాఖ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. సుమారు కోటి రూపాయల వ్యయంతో, 500 మీటర్ల పొడవు రోడ్డు విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. విద్యుత్ స్తంభాలు మార్పు చేయడంపై అధికారులకు పలు సూచనలు చేశారు. నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌ని కోరారు. ఈ పరిశీలన కార్యక్రమంలో తాడేపల్లి మండల విద్యుత్ శాఖ ఎఇ నాగ మల్లేశ్వరరావు, ఇప్పటం సొసైటీ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, వైసిపి గ్రామ నాయకులు ఎం.రాంబాబు, ఎ.నాగయ్య, ఎన్.శ్రీనివాసరావు, సిహెచ్ వెంకటరెడ్డి, డి.తిరుమలరెడ్డి, కె.సాంబిరెడ్డి, ఎన్.రాంబాబు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధి కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - తాడికొండ

నైపుణ్యాభివృద్ధి కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా జి. రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.నవంబర్, 2023 నుండి ఆన్లైన్ సర్టిఫికెట్ కోర్సులు చిరుధాన్యాలు, పట్టుపురుగుల పెంపకం, వర్మీ కంపోస్ట్, బయో ఫెర్టిలైజర్, 8 వారాలు (2 నెలలు) వ్యవధిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఒక్కొక్క కోర్సుకు రూ.1,500 చొప్పున ఫీజు చెల్లించి కోర్సుకు నమోదు కావాలని తెలిపారు. నమోదు చేసుకున్న అభ్యర్థులకు ఆన్‌లైన్ సదుపాయం (కంప్యూటర్/ఆండ్రాయిడ్ సెల్ ఫోన్/ఐపాడ్) కలిగి ఉండాలన్నారు. ఈ సర్టిఫికెట్ కోర్సులు చేసేందుకు ఆసక్తికలవారు తమ పేర్లను అక్టోబర్-20 లోపు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కోర్సులకు సం బంధించిన పూర్తి వివరాల కోసం ఫోన్ నంబర్లు 8008788776, 83096 26619, 9110562727, వ్యవసాయ విశ్వవిద్యాల యం వెబ్ సైట్ www.angrau.ac.inలో సంప్రదిం చాల్సిందిగా కోరారు. ఆయా సర్టిఫికెట్ కోర్సులలో ఆన్‌లైన్ క్లాసు లతో పాటు ప్రతి కోర్సులో ప్రయోగ కార్యక్రమాలు నిర్వహించి, ప్రాక్టికల్ క్లాసులను ఒక రోజు స్టడీసెంటర్లలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించండి

ప్రజాశక్తి - చేబ్రోలు

ఈ నెల18వ తేదీ నుండి 22వ తేదీ వరకు జరిగే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పొన్నూరు నియోజకవర్గ ఎంఆర్‌పిఎస్ ఎంఎస్పి అధ్యక్షులు మురికిపూడి హృదయ రాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెండో రోజు నిర్వహిస్తున్న మహా నిరాహార దీక్షలో తెనాలి బిజెఆర్ యూత్ కమిటీ అధ్యక్షులు మేకల సురేష్ పాల్గొని సంఘీ భావం తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేస్తా నని ఇచ్చిన మాటకు కట్టుబడి ఎస్ సి వర్గీకరణ బిల్లు పార్ల మెంట్ లో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. అనేక వేదికల మీద మేము అధికారంలోకి వస్తే 100 రోజుల్లోనే వర్గీకరణ చేసి బిల్లుకు చట్టబద్ధత కల్పించి న్యాయం చేస్తానని గతంలో బిజెపి హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎం ఆర్ పి ఎస్ ఎం ఎస్ పి ఆధ్వర్యంలో దీక్ష శిబిరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమా వేశాల్లో ఎస్ సి వర్గీకరణ బిల్లు పెట్టి చట్టభద్దత కల్పించే వరకు దీక్ష శివరాలు నిరంత రాయంగా కొనసాగించడం జరుగుతుందని అన్నారు. దీక్షలో ఉన్నవ ఇమ్మానుయేలు, మేరి బాబు,బాబు వెంకటేష్, కె షారోన్ పాల్గొన్నారు.

అర్జీదారుల సమస్యలు పరిష్కరిస్తాం

ప్రజాశక్తి - కాకుమాను

జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అర్జీలను సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ బుధవారం స్వీక రించారు. అర్జీదారుల సమస్యలపై ఉన్నతాధికారులతో చర్చించిన ఆమె, ఆయా సమస్యలను వెంటనే పరిష్కరిం చేలా చూడాలని ఆదేశించారు.

కాకుమానులో ఎస్ సి శ్మశానవాటికకు వెళ్ళే రోడ్డు వేయాలని పలు మార్లు అర్జీలు పెట్టినా అధికారులు స్పందించడంలేదని, ఆ కాలనీకి చెందిన వారు సబ్ కలెక్టర్‌కు, ఎస్ సి కార్పొరేషన్ ఈడీ ప్రేమకుమారికి వివ రించారు. ఈ అర్జీని సిఎంఒ కార్యాలయానికి పంపిస్తా మని, సమస్యను పరిష్కరి స్తామని సబ్ కలెక్టర్ వారికి

అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ

చెప్పారు. ఈ సందర్భంగా గీతాంజలి శర్మ మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ప్రసాదరావు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలు, పాఠశాలను సందర్శించిన తహశీల్దార్

ప్రజాశక్తి - చేబ్రోలు

పోలింగ్ స్టేషన్లను, మండల పరిషత్ ప్రాథమి పాఠ శాలను చేబ్రోలు తహశీల్దార్ కె వి గోపాలకృష్ణ బుధ వారం సందర్శించారు. సుద్దపల్లి, వేజండ్ల పోలింగ్ స్టేష న్లను పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకానికి అందించే రేషన్ బియ్యం నాణ్యత లోపం ఉందన్న సమాచారం మేరకు సుద్దపల్లి ఎస్సి ఏరియాలో మం డల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు వెళ్లి, బియ్యాన్ని పరిశీలించినట్లు చెప్పారు. ఈ విషయమై ఉపా ధ్యాయు లను ఆరా తీశారు. ఎండిఎం బియ్యము సక్రమంగా అందుతున్నాయని, బియ్యం మంచిగా ఉన్నాయని చెప్పారని అన్నారు. మధ్యాహ్న భోజనం పథకం ద్వారా పాఠశాల విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారం అందించే దానిలో భాగంగా ఫోర్టిఫైడ్ రైసును సాధారణ బియ్యంతో కలిపి అందిస్తున్నట్లు చెప్పారు. పాఠశాల ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు దీనిపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. వేజెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించిన సమయంలో 'నాన్న' అనే వ్యాసం గురించి విద్యార్థులు రాస్తున్న సందర్భంలో వారితో ఆయన మాట్లాడారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులు ఎంతగా శ్రమించి పిల్లలను ఉన్నత స్థాయిలో ఉంచాలని కోరుకుంటారనే దానిని గ్రహిం చాలని, ప్రతి ఒక్క విద్యార్థి క్రమశిక్షణతో , బాధ్యతతో చదువుకోవాలని వారికి చెప్పారు. కార్య క్రమంలో విఆర్ఒలు కె.ప్రసాదు, వెంకట్ పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలను యజమానులు శుభ్రం చేయించాలి

ప్రజాశక్తి-తెనాలి

పురపాలక సంఘం పరిధిలో ఖాళీగా ఉన్న నివేశనా స్థలాల్లో నిల్వ ఉన్న నీటిపై బుధవారం దోమల నియం త్రణ చర్యలు చేపట్టారు. ఖాళీ స్థలాల్లో వ్యర్థాల నిల్వలు లేకుండా, పిచ్చి చెట్లు పెరగకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఎం.జస్వంతరావు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో స్థల యజమానులు స్పం దించని స్థలాల్లో శానిటరి ఇన్‌స్పెక్టర్ ఎ.రామచంద్రరావు సారధ్యంలో ఐతానగర్ 40వ వార్డులో ఖాళీ నివేశన స్థలంలో చేరిన నీటిపై ఆయిల్ బాల్స్ చల్లించారు. దోమల నియంత్రణ చర్యలు చేపట్టారు. ఆస్థలం పురపాలక సంఘానికి చెందినదంటూ బోర్డు కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థల యజమానులు స్పందించి, నివేశన స్థలాల్లో వ్యర్థాలు

ఐతానగర్‌లోని ఖాళీ స్థలంలో బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు

లేకుండ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎ.నాగవేణి, శానిటరి సెక్రటరీలు ఎ.వెంకట్రావ్, షేక్ షఫి, సుదీప్, శానిటరి మేస్త్రీలు, స్థానికులు పి.డానియెల్, పి.ప్రసంగి పాల్గొన్నారు.

నూతనంగా మంజూరైన పెన్షన్ల పంపిణీ

ప్రజాశక్తి - తాడికొండ

దేశంలో ఎవరు అందించని సంక్షేమాన్ని ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి అందిస్తున్నాడని నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. మండలం లోని పొన్నెకల్లులో బుధవారం నూతనంగా మంజూరైన పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సం క్షేమాన్ని అందించే దిశగా ముందుకెళ్తున్నామని చెప్పారు. చంద్రబాబు నాయుడు తన పరిపాలనలో ఒక సెంటు భూమిని కూడా పేదలకు ఇవ్వలేదని విమర్శించారు.

పెన్షన్ అందజేస్తున్న కత్తెర సురేష్‌కుమార్

చంద్రబాబు హయాంలో అవినీతి అక్రమాలు కుంభ కోణాలే ప్రధాన అంశంగా పనిచేశారన్నారు.

తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడి

ప్రజాశక్తి-తెనాలి

వరి సాగులో పెట్టుబడులు తగ్గిం చుకుని, లాభ దాయకంగా సాగు చేసేందుకు రైతులు సమిష్టిగా కృషి చేయాలని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎన్. ఉషారాణి అన్నారు. రూరల్ గ్రామం మల్లెపాడు వ్యవ సాయ క్షేత్రంలో బుధవారం పొలంబడి నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏడిఏ మాట్లాడుతూ వరిలో సస్యరక్షణకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిం చారు. ఎరువుల యాజ మాన్య పద్ధతులను వారికి తెలియజేశారు. వరిని ఆశించే తెగుళ్లు, చీడపీడలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఉపయోగిం చాల్సిన మందులు, వాటి పిచికారి విదానాన్ని వివ రించారు. కార్యక్రమంలో ఏఈవో మోహన్, వివిఎ లక్ష్మి, పాల్గొన్నారు.

గుంటూరు జిల్లా

గురువారం 14 సెప్టెంబర్ 2023

కాశయ్యకు సిపిఎం నాయకుల పరామర్శ

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని కొలనుకొండకి చెందిన సిపిఐ మంగళగిరి నియోజకవర్గం నాయకులు కంచర్ల కాశయ్య ఇటీవల ప్రమాదానికి గురయ్యారు. ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని ఇంటిదగ్గర విశ్రాంతి తీసుకుంటున్న కాశ య్యను బుధవారం సిపిఎం నాయకులు ఎస్ఎస్ చంగయ్య, సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి లు కాశయ్య నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ప్రైవేటు పాఠశాలల్లో తనిఖీ

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరు మండలంలోని అన్ని ప్రైవేటు పాఠశాలలను ఎంఇఒ రుద్రపాటి శోభాచంద్, ఎంఇఒ-2 శ్రీనివాసరెడ్డి నోడల్ ఆఫీసర్ వైఎస్‌టి సాయి బుధవారం పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. పాఠశాలలోని రిజిస్టర్ పట్టికను పరి శీలించారు. ఈ నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రధానోపాధ్యాయులకు చెప్పారు. తనిఖీలలో సిఆర్పి దాసు పాల్గొన్నారు.

చవితి మండపాలకు అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

ఈ నెల 18వ తేదీన వినాయక చవితి సందర్భంగా మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని అర్బన్ పోలీస్‌స్టేషన్ సిఐ ఎండి ఖాజా అల్తాఫ్ హుస్సేన్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండపాలు ఏర్పాటు చేసేవాళ్లు ఒక కమిటీగా ఏర్పడి విద్యుత్, అగ్నిమాపక శాఖల అనుమతులుగా తీసుకోవడంతోపాటు నిబంధనల ప్రకారం మండపాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ముందస్తు ఎస్ హెచ్ ఓ అనుమతితో తీసుకోవాలని అన్నారు.

బాలికలకు గొడుగులు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

స్థానిక వీవర్స్ కాలనీలోని మున్సిపల్ హైస్కూల్లో మిషన్ ఆఫ్ జాయ్ వ్యవస్థాపకులు, డైరెక్టర్ కె-నాగ భూషణం, సహాయకులు ఆనందరావు ఆధ్వర్యంలో బుధవారం 35 మంది బాలికలకు గొడుగులు పంపిణీ చేశారు. అదేవిధంగా ఈ సంవత్సరం 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు చొప్పున నగదు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎస్ శ్రీనివాసరావు, రత్నాలు చెరువు బి ఎన్ ఆర్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు యు.ఏడుకొండలు పాల్గొన్నారు.

ఆర్‌విఆర్ అధ్యాపకుడికి పిహెచ్‌డి

ప్రజాశక్తి-గుంటూరు

డాక్టర్ భాష్యం కృష్ణమోహన్

ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజిలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ భాష్యం కృష్ణమోహన్‌కు భరతీదాసన్ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. కృష్ణమోహన్ 'ప్రిడిక్టివ్ పారడిమాటిక్ అన్ కయోటిక్ ఫైనాన్షియల్ టైమ్ సిరీస్ అప్లైయింగ్ డీప్ లెర్నింగ్ హైబ్రిడ్స్' అనే అంశంపై ప్రొఫెసర్ డాక్టర్ ఎం.దొరైరాజ్, ఆర్‌విఆర్ ఇంజినీరింగ్ కాలేజి ప్రొఫెసర్ డాక్టర్ సిహెచ్.సునీత పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు పిహెచ్‌డి పొందారు. కృష్ణమోహన్‌తో పిహెచ్‌డి కలిగిన సిబ్బంది మొత్తం 136 మంది ఉన్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తెలిపారు. కృష్ణమోహన్‌ను కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కార్యదర్శి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ అభినందించారు.

విజ్ఞాన్స్ వర్సిటీ విద్యార్థినికి పీహెచ్‌డీ

ప్రజాశక్తి-గుంటూరు

డాక్టర్ ఆళ్ల సుశీల

వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ కన్వెన్షనల్ ఇంజినీరింగ్ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సివిల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ఆళ్ల సుశీల అనే విద్యార్థినికి తమ యూనివర్సిటీ సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో పీహెచ్‌డీ పట్టా అందించిందని వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. సుశీల 'పెర్ఫార్మెన్స్ ఎవాల్యూషన్ ఆన్ యుటిలైజేషన్ ఆఫ్ స్మెయిల్ షెల్ పౌడర్ సిమెంట్ కాంపోసిట్ ఇన్ డిటీరియోరేటెడ్ స్ట్రక్చర్స్' అనే అంశంపై పరిశోధన చేసిందని తెలియజేశారు. ఈమెకు విజ్ఞాన్స్ యూనివర్సిటీ సివిల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ ఏ.శివశంకర్ గైడ్‌గా వ్యవహరించారన్నారు. ఈమె తన పరిశోధనలో భాగంగా మొత్తం 5 స్కూపస్ పేపర్లు పబ్లిష్ చేశారన్నారు. ఆళ్ల సుశీలను ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

నైపుణ్యాల సాధనతోనే ఉద్యోగాలు

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న అలెగ్జాండర్

ఇంజినీరింగ్ విద్యార్థులు కేవలం మార్కుల ఆధారంగా ఉద్యోగాలు సాధించలేరని, మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థుల్లో కమ్యూనికేషన్స్ జాబ్ ఓరియంటేషన్ నైపుణ్యాల సాధన ద్వారా అనుకున్న ఉద్యోగాలను సంపాదించవచ్చని వి ఎడ్యుకేర్ సంస్థ సీఈవో విశ్రాంత ఇన్‌కంట్యాక్స్ అధికారి గోశాల అలెగ్జాండర్ పేర్కొన్నారు. స్థానిక లాం చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన 'మాస్టరింగ్ ది ది ఫ్యూచర్-ఏ జర్నీ బియాండ్ బిటెక్' అంశంపై జరిగిన అవగాహన సదస్సులో అలెగ్జాండర్ మాట్లాడుతూ బీటెక్ పూర్తయిన విద్యార్థులు ఎంచుకున్న రంగంలో అనుకున్న లక్ష్యాలను సాధించాలంటే సాంకేతిక పరిజ్ఞానంతో పాటు వాస్తవ ప్రపంచంలో మార్పులను అర్థం చేసుకోవటం ఎంతో అవసరం అన్నారు. ఇంజినీరింగ్ దశలో యువతను వారి భవిష్యత్తును నిర్దేశం చేయడానికి సరైన సాధనాలతో సన్నద్ధం చేయటంలో వి ఎడ్యుకేట్ సంస్థ నిబద్ధతతో కృషి చేస్తుందని తెలియజేశారు. సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సాయిలక్ష్మి మాట్లాడుతూ విద్యారంగంపై ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ తీవ్ర ప్రభావం కనపరుస్తున్నదని, వి ఎడ్యుకేర్ సంస్థ రాబోయే 25 సంవత్సరాలకు కావాల్సిన ఉద్యోగ నైపుణ్యాలపై విద్యార్థులకు కావాల్సిన సమగ్ర శిక్షణ అందిస్తుందని వివరించారు. కార్యక్రమంలో చీఫ్ బిజినెస్ ఆఫీసర్ పుష్పరాజ్, చలపతి ఇంజనీరింగ్ కళాశాల ఆర్ అండ్ డి రంగయ్య, ప్రిన్సిపల్ చంద్రశేఖర్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు

పద్మావతిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కళాశాలకు గర్వకారణం పద్మావతి

ప్రజాశక్తి-గుంటూరు

సీనియర్ గణితశాస్త్ర అధ్యాపకురాలు, కళాశాల అధ్యాపక సంఘం అధ్యక్షురాలుగా నిబద్ధతతో పనిచేస్తున్న చల్లా పద్మావతి కళాశాలకు గర్వకారణం అని ప్రభుత్వ జూనియర్ మహిళా కాలేజీ ప్రిన్సిపాల్ జి.సునీత పేర్కొన్నారు. ఇటీవల ఉపాధ్యాయ దినోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వం నుండి ఉత్తమ అధ్యాపక అవార్డును రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతులమీదుగా అందుకున్న పద్మావతిని బుధవారం కళాశాలలో శాలువా, బొకేతో సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు పున:పరిశీలన పూర్తి

- జిల్లా సంయుక్త కలెక్టర్ రాజకుమారి

ప్రజాశక్తి-గుంటూరు

సమావేశంలో మాట్లాడుతున్న జెసి రాజకుమారి

జిల్లాలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా ఎస్.ఎస్.ఆర్-2024 ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణకు అవసరమైన అన్ని చర్యలు పకడ్బందీగా తీసుకోవడం జరుగుతున్నదని జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజ కుమారి తెలిపారు.బుధవారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, నగర కమిషనర్ కీర్తి చేకూరితో కలిసి ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్-2024లో ఇంటింటికీ ఓటరు కార్డుల వెరిఫికేషన్‌పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.బిఎస్‌పి నాయకులు సిహెచ్.వాసు బిజెపి నాయకులు రాచమల్లు భాస్కరరావు, టిడిపి నాయకులు ఓంకార్, కాంగ్రెస్ నాయకులు బి.సునీల్, సిపియం నాయకులు వై.కృష్ణకాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలో ఇంటింటికీ ఓటరుకార్డు వెరిఫికేషన్ ప్రక్రియ క్షేత్రస్థాయిలో పూర్తి అయ్యిందని, రీవెరిఫికేషన్ కూడా పూర్తయ్యిందన్నారు. ఎస్.ఎస్.ఆర్-2024కు సంబంధించిన అన్ని ప్రక్రియలు పారదర్శకంగా, సక్రమంగా నిర్వహించటం జరుగుతుందన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకుల మేరకు తొలగించిన ఓట్లను నియోజకవర్గాల్లో ర్యాండమ్‌గా పరిశీలించటం జరిగిందన్నారు. నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారమే క్షేత్రస్థాయిలో అధికారులు వెరిఫికేషన్ చేసిన తరువాత మాత్రమే ఈఆర్వోలు ఓట్లు తొలగింపు దరఖాస్తులు పరిష్కరించినట్లు తెలిసిందన్నారు. పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియ ఈ నెల 15వ తేదిలోపు పూర్తి చేసి ప్రతిపాదనలు అందించాలని ఈఆర్ఓలకు సూచించారు. ఏప్రిల్ 15 నుండి సెప్టెంబర్ 13 వరకు క్లెమ్‌లకు సంబంధించి 1,85,797 దరఖాస్తులు అందాయని, ఇంకా 1,02,169 క్లెమ్స్‌ను పరిష్కరించాల్సి వుందన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం మాత్రమే క్లెమ్స్ లు పరిష్కరించాల్సి వుందని, ఎటువంటి అనామలీస్ ఉండరాదన్నారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లలితా, వెంకట శివరామిరెడ్డి, ఆర్డీవో ప్రభాకర్ రెడ్డి, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పెద్ది రోజ, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్ , ఐసీడీఎస్ పీడీ మనోరంజని, కలెక్టరేట్ ఏవో పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పరిశోధనలతో అత్యుత్తమ ఫలితాలు

సామాజిక ఇంజినీరింగ్‌కు సదస్సులు దోహదం

ఐఇఎ మాజీ జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ అనిల్‌కుమార్ ఠాకూర్

ప్రజాశక్తి - ఎఎన్‌యు



అనిల్‌కుమార్ ఠాకూర్‌ను సన్మానిస్తున్న ఎకనామిక్స్ విభాగం ఆచార్యులు, సిబ్బంది

ఉత్తమ పరిశోధనలు అత్యుత్తమ ఫలితాలు ఇస్తాయని, సదస్సులు సామాజిక ఇంజనీరింగ్‌కు దోహదపడతాయని ఆచార్య అనిల్ కుమార్ ఠాకూర్ అన్నారు. బుధవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఎకనామిక్స్ విభాగం ఆధ్వర్యంలో 'ఉత్తమ పరిశోధనలతో అత్యుత్తమ ఫలితాలు' అనే అంశంపై ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. అర్థశాస్త్ర విభాగ అధిపతి ఆచార్య కడిమి మధుబాబు అధ్యక్షతన ముఖ్యఅతిథిగా హాజరైన ఇండియన్ ఎకనామిక్ అసోసియేషన్ (ఐఇఎ) మాజీ జనరల్ సెక్రెటరీ, గౌరవ ముఖ్య సలహాదారులు ఆచార్య అనిల్ కుమార్ ఠాగూర్ ప్రసంగించారు. విద్యార్థులు, పరిశోధకులు లక్ష్యాన్ని ఎంచుకొని, నిరంతర సాధన ద్వారా అత్యున్నత స్థానాలను అధిరోహించాలని సూచించారు. ఎకనామిక్స్ చదివిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో కూడా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. సమాజానికి ప్రయోజనకరంగా ఉండే పరిశోధనా అంశాలను ఎంచుకొని పరిశోధనలు చేపట్టి తద్వారా వచ్చే సత్ఫలితాలను సమాజానికి అందించాలన్నారు. కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కాకుండా పరిశోధన అంశాలను జాతీయ స్థాయిలో జరిగే సదస్సులలో ఉపన్యసించుట ద్వారా సోషల్ ఇంజనీరింగ్‌కు దోహదపడుతుందని వెల్లడించారు. ఇండియన్ ఐఇఎకు వర్సిటీ ఎకనామిక్స్ విభాగానికి విడదీయరాని బంధం ఉందన్నారు. 2017 సంవత్సరంలో వర్సిటీ వేదికగా 100వ (ఐఇఎ) వేడుకలు చరిత్రలో నిలిచిపోయే విధంగా విజయవంతంగా ముగిశాయని జ్ఞాపకం చేశారు. ఈ ఏడాది భువనేశ్వర్ లో జరిగే ఐఇఎ సమావేశంలో పాల్గొని, తమ పరిశోధన పత్రాలను సమర్పించాలని కోరారు. కార్యక్రమంలో అర్థశాస్త్రంలో సుదీర్ఘ అనుభవజ్ఞులైన ఆచార్య సి. ఎస్. ఎన్ . రాజు, వర్సిటీ అంబేద్కర్ స్టడీస్ ఆచార్యులు ఆచార్య అశోక్ కుమార్, అర్థశాస్త్ర విభాగ అధ్యాపకులు డాక్టర్ ఎ బాలకష్ణ, డాక్టర్ కే. మహేంద్ర కుమార్ డాక్టర్ కే. కిషోర్ బాబు డాక్టర్ నంబూరు బాబు, డాక్టర్ పి. శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు.

నాట్యమయూరి గ్రీష్మశ్రీ, తహసీన్‌లకు సత్కారం

ప్రజాశక్తి-తెనాలి

నర్తకీలను సత్కరిస్తున్న డాక్టర్ శారద, పూర్ణచంద్ తదితరులు

పట్టణానికి చెందిన ప్రముఖ బాలనర్తకిలు గ్రీష్మశ్రీ, తహసిన్‌లను ఈదర రామారావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక సుల్తానాబాద్‌లోని రత్నా ఫార్చ్యూన్ కల్యాణ మండపంలో బుధవారం సత్కరించారు. చిన్నవయసులోనే ఇరువురూ తమ నాట్య ప్రతిభతో కర్నాటక గవర్నర్ తవార్ చంద్ గెహ్లోట్, హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయల నుంచి సత్కారం అందుకున్న నేపథ్యంలో వారి అభినందన సభ నిర్వహించారు. శారద సర్వీస్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ డి.శారద ముఖ్యఅతిథిగా పాల్గొని, ఇరువురు చిన్నారులు తెనాలి ప్రాంతానికే గర్వకారణమని ప్రశంసించారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్ష, కార్యదర్శులు ఈదర వెంకటపూర్ణచంద్, ఈదర శ్రీనివాసరావు, డాక్టర్ కె.అనిల్‌కుమార్, మండల విద్యాధికారి డాక్టర్ ఎం.లక్ష్మినారాయణ, రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ కన్నెగంటి మురళి, దిలీప్‌రాజా, ఎస్ అరుణకుమారి, కృష్ణారెడ్డి, ఆలియా, షేక్ రఫి పాల్గొన్నారు.